ఈనాడు
నల్గొండ
మంగళవారం సెప్టెంబరు 1, 2026 5

నీలగిరిలో రాజకీయ రగడ

❖ భాజపా, కాంగ్రెస్ నాయకుల పరస్పర దాడులు

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న భాజపా జిల్లా అధ్యక్షుడు వర్షిత్‌రెడ్డి

వర్షిత్‌రెడ్డి ఇంట్లోకి వెళుతున్న మున్సిపల్ మాజీ ఛైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, అనుచరులు

ఈనాడు, నల్గొండ: న్యూస్‌టుడే, నీలగిరి: జిల్లా కేంద్రంలో కాంగ్రెస్, భాజపా నాయకుల మధ్య రాజకీయరగడ చోటు చేసుకుంది. హైదరాబాద్‌లోని భాజపా కార్యాలయంపై కాంగ్రెస్ నాయకుల దాడికి నిరసనగా భాజపా జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి ఆధ్వర్యంలో మంత్రి కోమటిరెడ్డి క్యాంపు కార్యాలయం ముట్టడి, దిష్టిబొమ్మ దహనం, కార్యాలయంపై కోడిగుడ్లు, టమాటాలతో దాడులు చేశారు. భాజపా నాయకుల దాడికి నిరసనగా మున్సిపల్ మాజీ ఛైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి బృందం ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు భాజపా జిల్లా కార్యాలయం ముట్టడి, ప్రధాని మోదీ, వర్షిత్‌రెడ్డి ఫ్లెక్సీలను చించేశారు. బుర్రి శ్రీనివాస్ రెడ్డి, అతని అనుచర వర్గం చైతన్యపురి కాలనీలో ఉన్న వర్షిత్ రెడ్డి ఇంట్లోకి వెళ్లి వస్తు సామగ్రి ధ్వంసం చేశారు. భాజపా, కాంగ్రెస్ శ్రేణుల మధ్య నువ్వానేనా అన్నట్లుగా దాడులు జరిగాయి.

పోలీసుల ప్రేక్షకపాత్రపై విమర్శలు..

ఇరుపార్టీల నాయకులు పరస్పరం దాడులకు పాల్పడినప్పటికీ పోలీసులు ప్రేక్షకపాత్ర పోషించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మంత్రి క్యాంపు కార్యాలయం వద్దకు భాజపా జిల్లా అధ్యక్షుడు వచ్చి మంత్రి దిష్టిబొమ్మను దహనం చేసినప్పటికీ పోలీసులు స్పందించకపోవడం, మంత్రి కటౌట్‌కు, కార్యాలయంలో టమాటాలు, కోడిగుడ్లు విసిరేస్తున్నా ఈ సమాచారం పోలీసులకు ఆలస్యంగా తెలియడం గమనార్హం. కూతవేటు దూరంలో ఎస్పీ కార్యాలయం, నల్గొండ వన్‌టౌన్, టూటౌన్ ఠాణాలతో పాటు ఇంటెలిజెన్స్ వ్యవస్థ ఉన్నప్పటికీ దాడిని నిలువరించకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు భాజపా జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి ఇంటికి కాంగ్రెస్ నాయకులు వెళ్లి అతని తల్లి, మేనమామను తోసేస్తూ ఇంట్లోని వస్తువులను ధ్వంసం చేస్తున్నా అక్కడే ఉన్న పోలీసులు సకాలంలో స్పందించలేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

పరీక్షలకు ల్యాబ్‌డబ్

❖ ప్రైవేటులో అడ్డగోలుగా ఫీజుల వసూళ్లు

మిర్యాలగూడలోని ల్యాబ్‌ను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ రాహుల్

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాలోని పట్టణాలు, మండల కేంద్రాలతో పాటు పలు పల్లెల్లోనూ అనధికారిక ల్యాబ్‌లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. కనీస విద్యార్హత లేని పలువురు ఆర్‌ఎంపీలు, పీఎంపీలు ల్యాబ్‌లు ఏర్పాటు చేస్తుండగా వీరి సహకారంతో పలు చోట్ల ల్యాబ్‌లు ఏర్పాటు చేస్తున్నారు. వీటిలో అవసరం లేకుండా రక్తం, మూత్ర పరీక్షలు చేస్తూ రోగులను ఇబ్బందులకు గురి చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

❒ నిబంధనల ప్రకారం ల్యాబ్ టెక్నీషియన్ అర్హత కలిగి, అధికారికంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారు మాత్రమే ల్యాబ్‌లను నిర్వహించాల్సి ఉన్నప్పటికీ అనేక మంది ఈ నిబంధనలకు విరుద్ధంగా అనధికారికంగా ల్యాబ్‌లను ఏర్పాటు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 200కు పైగా ల్యాబ్‌లు ఉన్నట్లు అంచనా. పలు చోట్ల ఆసుపత్రులకు అనుసంధానంగా ఏర్పాటు ల్యాబ్‌లు ఏర్పాటు చేస్తుండగా వీటిలోనూ నిబంధనలు పాటించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

❒ ఇటీవల మిర్యాలగూడలోని డాక్టర్స్ కాలనీలో పలు ల్యాబ్‌లను తనిఖీ చేసిన జిల్లా వైద్యాధికారి డాక్టర్ రాహుల్ అనుమతులు లేని ఓ ల్యాబ్‌ను సీజ్ చేశారు. ఇదే ల్యాబ్‌లో గడువు తీరిన పలు మందులను సైతం అధికారులు గుర్తించి నోటీసులు జారీ చేశారు.

నిఘా

ఇంటి వద్దనే సేకరణ

నల్గొండ, మిర్యాలగూడ తదితర పట్టణాల్లో ల్యాబ్‌ల నిర్వాహకులు ఇంటికొచ్చి మరీ రక్త నమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహిస్తున్నారు. నివేదికలను నేరుగా వాట్సాప్‌కే పంపిస్తున్నారు. ఇలాంటి సేవలకు అందిన కాడికి దోచుకుంటున్నారు. మరో వైపు పలు పరీక్షల రిపోర్టుల్లో తప్పులు సైతం వస్తున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు.

బినామీ ధ్రువీకరణ పత్రాలతో నిర్వహణ

ల్యాబ్‌ల్లో అనేక మంది బినామీ ధ్రువీకరణ పత్రాలు పెట్టి అదే పేరిట అనుమతులు తీసుకొని అర్హతలు లేని వారే ల్యాబ్‌లను నిర్వహిస్తున్నారు. ఒక్కో ల్యాబ్‌లో సుమారు 20 నుంచి 90 రకాల పరీక్షలు నిర్వహిస్తున్నారు. రక్త, మూత్ర, టైఫాయిడ్, మలేరియా, డెంగీ, థైరాయిడ్, షుగర్ వంటి పరీక్షలు చేస్తున్నారు. ఒక్కో పరీక్షకు రూ.200 నుంచి రూ. 2 వేల వరకు వసూలు చేస్తున్నారు.

❒ ల్యాబ్‌ల్లో ఏ పరీక్షకు ఎంత ఛార్జీ వసూలు చేస్తున్నారనేది బోర్డులు ఏర్పాటు చేయాల్సి ఉన్నప్పటికీ ఇది సైతం ఎక్కడా అమలు కావడం లేదు. అనుమతులు లేని ల్యాబ్‌ల్లో తనిఖీలు చేపట్టి తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

తనిఖీలు చేపడతాం

–డాక్టర్ రాహుల్, జిల్లా వైద్యాధికారి, నల్గొండ

అనధికారికంగా నిర్వహిస్తున్న ల్యాబ్‌ల్లో తనిఖీలు చేపట్టి అనుమతులు లేని వాటిపై చర్యలు తీసుకుంటాం. ఇటీవల మిర్యాలగూడలో అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న ల్యాబ్‌ను సీజ్ చేశాం. జిల్లా వ్యాప్తంగా తనిఖీలు ముమ్మరం చేస్తాం.

వానలు కురిస్తేనే మీనం!

❖ అడుగంటుతున్న జలవనరులు ❖ ఆందోళనలో మత్స్యకారులు

గతేడాది పంపిణీ చేసిన చేప పిల్లలు

నీటినిల్వలు లేక ఎండిపోయిన కనగల్ మండలంలోని కురంపల్లి చెరువు

ఈనాడు, నల్గొండ: ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఆశించిన వర్షాలు లేకపోవడంతో చెరువులు దాదాపుగా అడుగంటాయి. చేపల ఉత్పత్తికి కావాల్సిన నీటినిల్వలు లేవు. దీంతో మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మూసీ, సాగర్ పరివాహక చెరువుల్లో నీటినిల్వలు కొద్దిమేర మాత్రమే ఉన్నాయి. మునుగోడు, కనగల్, చండూరు, దేవరకొండ, మిర్యాలగూడ, సూర్యాపేట, తిరుమలగిరి, కోదాడ, హుజూర్‌నగర్, తుంగతుర్తి, చిట్యాల, చౌటుప్పల్, భువనగిరి, నల్గొండ నియోజకవర్గాల్లో చెరువుల్లో వరదనీరు చేరకపోవడంతో ఆయా ప్రాంతాల్లో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నష్టపరిహారం అందించాలి

– కనుకు వెంకటనారాయణ, నల్గొండ జిల్లా మత్స్యశాఖ జిల్లా ఛైర్మన్

ఎల్‌నినో కారణంగా మూసీ, సాగర్ పరివాహక ప్రాంతంలోని పెద్దచెరువుల్లో మినహా ఎక్కడా నీటి నిల్వలు సమృద్ధిగా లేవు. చేపలు వృద్ధి చెందాలంటే నీటి నిల్వలు ఎక్కువగా ఉండాలి. నిల్వలు సరిగా లేకనే ఉచిత చేపపిల్లల పంపిణీ ఉండదని అధికారులు చెబుతున్నారు. మత్స్యకారులకు ఉపాధి కరవైన నేపథ్యంలో ప్రభుత్వం నష్టపరిహారం అందించాలి.

నిల్వలు పెరిగితేనే సరఫరా

–సుకీర్తి, జిల్లా మత్స్యశాఖ అధికారి, నల్గొండ

జలాశయాల్లో నీటినిల్వలు తగ్గిపోవడంతో ఈసారి చేపలపిల్లల విడుదల ఆలస్యం కానుంది. అంతా సిద్ధంగా ఉన్నా గుత్తేదారులు నీటి నిల్వల గురించి ఆందోళన చెందుతున్నారు. వర్షాలు పడి నీరు సమృద్ధిగా చేరితేనే పంపిణీ చేస్తాం.

ప్రతిపాదించిన చేప పిల్లల పరిమాణం, పంపిణీ లక్ష్యం(లక్షల్లో)

జిల్లా	35-40 ఎం.ఎం.	చెరువులు	80-100 ఎం.ఎం.	చెరువులు
నల్గొండ	178.02	956	420.16	211
యాదాద్రి	141.75	511	140.41	150
సూర్యాపేట	976.78	431	243.50	190

చేపపిల్లల పంపిణీ ఆలస్యం

❖ నల్గొండ జిల్లావ్యాప్తంగా 1,167 చెరువుల్లో 5.98 కోట్ల చేపపిల్లల పంపిణీ లక్ష్యంగా టెండర్లు పిలిచినా జలాశయాల్లో నీరు లేని కారణంగా సరఫరా ప్రక్రియ వాయిదా వేశారు. గుత్తేదారులు సైతం ముందుకు రావడం లేదు.

❖ సూర్యాపేట జిల్లాలో 621 చెరువుల్లో 3.41 కోట్ల మేరకు వదలాలని లక్ష్యం నిర్దేశించుకున్నారు. కనీస నీటినిల్వలు లేక అధికారులు పంపిణీకి వెనుకంజ వేస్తున్నారు.

❖ యాదాద్రి జిల్లాలో 661 చెరువుల్లో 2.81 కోట్ల చేప పిల్లలను వదలాలని అనుకున్నా నీటి లభ్యత తక్కువగా ఉండటంతో వాటిని సరఫరా చేసేందుకు ముందుకు రావడం లేదు.

అభివృద్ధి నిధులకు గ్రహణం

❖ రెండున్నరేళ్లుగా ఎదురుచూపులు

నల్గొండ కలెక్టరేట్, న్యూస్‌టుడే: నియోజకవర్గ అభివృద్ధి పథకానికి గ్రహణం పట్టింది. ఎమ్మెల్యేలకు నియోజకవర్గ అభివృద్ధి పథకం(సీడీఎఫ్) కింద పైసా విదల్చడం లేదు. దీంతో ఎమ్మెల్యేలు పట్టణాల్లో, పల్లెల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టలేని పరిస్థితి నెలకొంది.

తిప్పర్తి మండల కేంద్రంలో నిరుపయోగంగా మారిన షాదీఖానా

రూ.5 కోట్లకు పెంచినా...

నియోజకవర్గాల అభివృద్ధి, దీర్ఘకాలికంగా ఉన్న సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యేలు సీడీఎఫ్ వినియోగిస్తారు. ప్రధానంగా అసంపూర్తి భవనాలు, అదనపు గదులు, సీసీరోడ్ల నిర్మాణం, మౌలిక సదుపాయాలకు వెచ్చించేందుకు ప్రాధాన్యం ఇస్తారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఆమోదంతో ఈ నిధులు ఖర్చు చేయాల్సి ఉంటుంది. గతంలో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ఏడాదికి రూ.3 కోట్ల చొప్పున నిధులు విడుదల అవుతుండేవి. 2022-23లో నాటి ప్రభుత్వం ఈ మొత్తాన్ని రూ.5 కోట్లకు పెంచింది. ఇందులో రూ.3 కోట్లతో ఎమ్మెల్యే పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టే అవకాశం ఉండగా, మిగిలిన రూ.2 కోట్లు మాత్రం ప్రభుత్వ పాఠశాలల్లో గదుల నిర్మాణం, మరమ్మతులు, మౌలిక సదుపాయాల కల్పనకు వెచ్చించారు. విద్యాశాఖకు కేటాయించిన నిధులను గత ప్రభుత్వం నేరుగా ఆ శాఖకు విడుదల చేసింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం... మొదటి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లోనే నియోజకవర్గ అభివృద్ధి నిధులు కేటాయించింది. కాగా రెండున్నరేళ్లుగా ఒక్క నియోజకవర్గానికి కూడా నిధులు విడుదల చేయలేదు. ఈ కారణంగా అభివృద్ధి పనులు ముందుకు సాగడం లేదు.

రూ.120 కోట్లు...

ఉమ్మడి జిల్లాలో 12 నియోజకవర్గాలు ఉండగా ఒక్కో నియోజకవర్గానికి రూ.5 కోట్ల చొప్పున రెండేళ్లకు సంబంధించి రూ.120 కోట్ల సీడీఎఫ్ రావాల్సి ఉంది. నిధులు రాకపోవడంతో ఉమ్మడి జిల్లాలోని పలు గ్రామాలు, పట్టణాల్లో అభివృద్ధి పనులు నిలిచిపోయి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యేలు పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. నేటికీ ఫలితం కనిపించలేదు. ఈ కారణంగా ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేకపోతున్నామని ఎమ్మెల్యేలు సతమతమవుతున్నారు. అధికార పార్టీ ఎమ్మెల్యేలు జిల్లా మంత్రుల ద్వారా ఎంతోకొంత ఇతర నిధులు మంజూరు చేయించుకుంటూ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారు. ప్రతిపక్ష ఎమ్మెల్యే ఉన్న నియోజకవర్గం ఆ నిధులకు నోచుకోవడం లేదు. ఉమ్మడి జిల్లాలో 12 నియోజకవర్గాలుండగా వాటిలో సూర్యాపేట నియోజకవర్గం మినహా అన్ని నియోజకవర్గాల్లో అధికార పార్టీ ఎమ్మెల్యేలే ఉన్నారు. సీడీఎఫ్ నిధులు విడుదల కాకపోవడంతో కొంతమంది ఎమ్మెల్యేలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వీటిని విడుదల చేస్తే నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టవచ్చని, ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించే అవకాశం ఉంటుందని ఎమ్మెల్యేలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ఇటీవల ఇసుక ట్రాక్టర్ పట్టుకున్న పోలీసులు

బావులు ఎండితేనేం.. జేబులు నిండితేచాలు!

చింతపల్లి, న్యూస్‌టుడే: గ్రామాల్లో రోజురోజుకు భూగర్భజలాలు అడుగంటుతుండటంతో బావులు, బోర్లలో నీటిమట్టం తగ్గిపోతోంది. గ్రామాల్లో తాగునీటి కష్టాలు తీరడం లేదు. ఓ వైపు పల్లెల్లో ఏటా దాహార్తితో ప్రజలు తండ్లాతుంటే భూగర్భజలాల పెంపునకు దోహదపడే ఇసుకను మాత్రం వాగుల్లోంచి అక్రమంగా తరలిస్తున్నారు. అనుమతి లేకుండా ఈ దందా నిత్యం బహిరంగంగా సాగుతున్న పట్టించుకునే వారే కరవయ్యారు.

ఆన్‌లైన్‌లో తీసుకోలేక:

మండలంలోని 34 గ్రామ పంచాయతీలకు అవసరమైన ఇసుక.. దేవరకొండ మండలంలోని ముదిగొండ, సూర్యాతండాలకు చెందిన వాగుల నుంచి మాత్రమే అనుమతి ఉంది. అవసరమైన వారు ముందుగా ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకోవాల్సి ఉంది. ఆన్‌లైన్ ఇసుకకు ఒక్క ట్రాక్టర్‌కు రూ. 4వేలకుపైగా ఖర్చు అవుతోంది. అంత వెచ్చించ లేనివారు గ్రామాల్లోని వాగుల నుంచి తక్కువకు దొరికే ఇసుకను వినియోగిస్తున్నారు. పోలీసులు మాత్రం అడపాదడపా ఓ ట్రాక్టర్‌ను పట్టుకొని కేసులు నమోదు చేసి దస్త్రాల్లో నింపుతున్నారే తప్ప అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయలేకపోతున్నారు.

ఇసుక అక్రమ రవాణా:

చింతపల్లి మండలంలోని కుర్మపల్లి, సాయిరెడ్డిగూడెం, చాకలిశేరిపల్లి, వర్కాల, వింజమూరు, ఘడియగౌరారంతోపాటు పలు గ్రామాల్లోని వాగుల నుంచి అక్రమార్కులు ఇసుక రవాణా సాగిస్తున్నారు. పగలు, రాత్రుళ్లు ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు.

పక్కదారి పడుతోంది:

కేవలం మండలంలోని గ్రామాలకు చెందిన లబ్ధిదారులే ఇసుకను బుక్ చేసుకోవాలి. కానీ మండలానికి సరిహద్దులో రంగారెడ్డి జిల్లా మాడ్గుల, యాచారం మండలాల వారు చింతపల్లి పేరు మీద బుక్ చేసుకుంటున్నారు. ఇసుక రాగానే ట్రాక్టర్ యాజమానులు ఒక్క ట్రిప్‌నకు రూ.500 నుంచి రూ.1000 వసూలు చేస్తున్నారు. దీంతో వినియోగదారుల జేబులకు చిల్లులు పడుతున్నాయి.

❖ 'వాగుల నుంచి అక్రమంగా ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. ఇటీవల ట్రాక్టర్‌ను పట్టుకొని కేసు నమోదు చేశాం. నిఘా ఏర్పాటు చేస్తాం' అని ఎస్సై ముత్యాల రామ్మూర్తి తెలిపారు.

ఆదాయం ఘనం... ఖాళీల భర్తీ కనం

మిర్యాలగూడ, న్యూస్‌టుడే: నాగార్జున సాగర్ ఆయకట్టు మొదటి జోన్ పరిధిలో విస్తరించిన నల్గొండ జిల్లాలోని వ్యవసాయ మార్కెట్ యార్డులకు ఏటా రూ.60 కోట్లకు పైగా ఆదాయం సమకూరుతుంది. జిల్లాలో మిర్యాలగూడ, దేవరకొండ, నల్గొండ, హాలియా, నకిరేకల్, నిడమనూరు, చిట్యాల, చండూరు, వెంకటేశ్వనగర్, శాలిగౌరారంలో ఈ మార్కెట్లు ఉన్నాయి. ఇందులో 156 పోస్టులుండగా రెగ్యులర్ ఉద్యోగులు 43 మంది మాత్రమే ఉండగా 113 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో 127 మంది ఔట్ సోర్సింగ్ సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. వీరు రెగ్యులర్ ఉద్యోగుల విధులు నిర్వర్తించాల్సి వస్తుంది. మార్కెట్ యార్డుల్లో శాశ్వత ఉద్యోగుల కొరత ఉండగా వారితోనే నెట్టుకొస్తున్నారు. పలువురు ఉద్యోగ విరమణ పొందగా, కొందరు బదిలీపై వెళ్లిన వారి స్థానాల్లో నియామకాలు చేపట్టకపోవడంతో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులే విధులు నిర్వర్తిస్తున్నారు.

పొరుగు సేవల సిబ్బందే..

జిల్లాలో పది వ్యవసాయ మార్కెట్ కమిటీలు ఉన్నాయి. ఆయా చోట్ల మొత్తం ఔట్ సోర్సింగ్ సిబ్బందే మార్కెట్ ఫీజు వసూళ్లలో కీలక పాత్ర పోషిస్తున్నారు. ఏటా పంట దిగుబడులు, మిల్లులు, దుకాణాల అద్దెలతో పాటు వివిధ రూపాల్లో ఆదాయం బాగానే ఉంది. 2024లో పది మార్కెట్ల పరిధిలో రూ.65.10 కోట్లు ఆదాయం లక్ష్యం పెట్టుకోగా రూ.71.51 కోట్లు సమకూరింది. 2025లో రూ.66.10 కోట్లు లక్ష్యం పెట్టుకున్నారు.

❒ సిబ్బంది ఖాళీల విషయాన్ని ప్రభుత్వానికి నివేదించామని జిల్లా వ్యవసాయ మార్కెటింగ్ అధికారి ఛాయాదేవి తెలిపారు. ఉన్న సిబ్బందితో మార్కెట్ ఆదాయం లక్ష్యం మేరకు వసూళ్లు చేస్తున్నామని అన్నారు.

నోట్లతోనే.. స్లాట్లు

నిడమనూరు, న్యూస్‌టుడే: అవినీతికి, అక్రమాలకు అడ్డాగా మారింది.. నిడమనూరు సబ్ రిజిస్ట్రేషన్ శాఖ కార్యాలయం. రిజిస్ట్రేషన్ కావాలంటే పత్రాలన్నీ సరిగా ఉంటే సరిపోదు.. భారీ మొత్తంలో చేతులు తడిపితేనే పనులు ముందుకు సాగుతున్నాయి. ఆర్థిక అవసరాల కోసం ఇళ్లను, భూములను తాకట్టు పెట్టుకొని రుణాలు తీసుకునే వారి వద్ద కూడా కనికరం చూపకుండా పర్సంటేజీల ప్రకారం పీల్చి పిప్పి చేస్తున్నారు. భూముల ఆన్‌లైన్‌కు మార్కెట్ ధర ప్రకారం ప్రభుత్వానికి రుసుము చెల్లించాలి. కార్యాలయ అధికారులు కూడా అదే పర్సంటేజీల ప్రకారం దర్జాగా వసూళ్లు చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. లంచం డబ్బులు మేము ఇవ్వలేమని చెబితే.. మీ పని కాదని కార్యాలయ సిబ్బంది సమాధానం ఇస్తున్నారని పలువురు చెబుతున్నారు.

❖ కార్యాలయం సమీపంలో ఎన్నో ఏళ్లుగా డాక్యుమెంట్ రైటర్లుగా పని చేస్తున్న ఒకరిద్దరిదే లంచాల్లో కీలకపాత్ర. డాక్యుమెంట్ తయారుచేసే సమయంలోనే ఇంటి రిజిస్ట్రేషన్‌కు ఓ రేటు, ఓపెన్ ప్లాటుకో రేటు.. ఇలా ప్రతిదానికో ఒక్కో రేటు నిర్ణయించి పర్సంటేజీల ప్రకారం ప్రజల నుంచి రూ.నాలుగు వేల నుంచి పది వేల వరకు వసూళ్లు చేస్తున్నారు.

❖ కార్యాలయ అధికారులు, డాక్యుమెంటు రైటర్లకి ఎంత అవినాభావ సంబంధం ఉందంటే.. ఏకంగా వారి విధులను, కంప్యూటర్లను ఏకంగా బయటి వారికి అప్పగించి పనులు చేయించుకునేంతలా. రిజిస్ట్రేషన్ శాఖ అంటే కోట్లాది రూపాయల ఆస్తుల వివరాలు మార్పిడి చేసే ఐచ్ఛికాలు, అవకాశాలు ఆ శాఖ కంప్యూటర్లు, సర్వర్లలో ఉంటాయి. అలాంటి కంప్యూటర్లను కొన్ని సందర్భాల్లో డాక్యుమెంట్ రైటర్ల కింద పని చేసే సిబ్బందికి అప్పగిస్తున్నారు.

వసూళ్లపై మాకు ఎలాంటి సంబంధం లేదు..

–దేవానంద్, రిజిస్ట్రార్, నిడమనూరు.

రిజిస్ట్రేషన్‌కు సంబంధించి ప్రజల నుంచి చలానా కంటే డాక్యుమెంటు రైటర్లు అధిక రుసుము వసూళ్లు చేస్తున్నట్లు మా దృష్టికి రాలేదు. అందులో మాకు ఎలాంటి సంబంధం లేదు. మా కార్యాలయ సిబ్బంది కూడా ప్రజల నుంచి డబ్బులు వసూళ్లు చేయడం లేదు.

గుట్ట క్షేత్రంలో శ్రావణ ఆరాధనలు

శివాలయంలో ఆరాధన

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి పుణ్యక్షేత్రంలో సోమవారం హరిహరులను కొలుస్తూ, ఆరాధన పర్వాలను ఆయా ఆలయాల్లో విశేషంగా చేపట్టారు. ప్రధాన ఆలయంలో స్వయంభువులను ఆరాధిస్తూ నిత్య పూజలు ఆస్థాన, ఆర్జిత సేవలు కొనసాగాయి. అష్టభుజి మండప ప్రాకారంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, శ్రీ లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం నిర్వహించారు. సాయంత్రం గరుడ వాహనంపై శ్రీస్వామి, ముత్యాల పల్లకీపై అమ్మవారు అలంకృతులై సేవోత్సవం పొందారు. శ్రీపర్వత వర్ధిని రామలింగేశ్వరస్వామి ఆలయంలో మహన్యాసపూర్వక రుద్రాభిషేకం, బిల్వ పత్రాలతో ప్రత్యేక అర్చన, శివ, పార్వతుల కల్యాణోత్సవం నిర్వహించారు.



యాదగిరిగుట్ట క్షేత్రం

దర్శనాల దందా!

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే:

యాదగిరిగుట్ట పుణ్యక్షేత్రంలో దళారి, క్షేత్ర సందర్శనకు వచ్చే భక్తుడి మధ్య జరిగిన సంభాషణ ఇది. దైవసన్నిధిలో గుట్టుచప్పుడు కాకుండా కొనసాగుతున్న దళారుల దందా ఇది. టోల్ ఫీజు లేకుండానే కారులోనే కొండపైకి తీసుకెళ్లడం, నేరుగా దైవ దర్శనం చేయించడం, వేదాశీర్వచనం, వీలైతే స్వామివారి అన్న ప్రసాదం ఇప్పిస్తుంటారు. వీరు ఎక్కడా టికెట్లు తీసుకోవడం లేదు. ఇలా ప్యాకేజీ నిర్ణయించి దందాలు చేస్తున్నారు.

డబ్బులిస్తే నేరుగా యాదగిరీశుడి దర్శనం

● రియల్ ఎస్టేట్ బ్రోకర్లు, చోటా మోటా లీడర్లు భక్తులతో ప్యాకేజీలు మాట్లాడుకుని ఆలయాధికారుల్లో కొందరిని మచ్చిక చేసుకుని దందా కొనసాగిస్తున్నారు. కొండ కింద బసచేసే ప్రైవేటు లాడ్జిలు, సత్రాలు, ఆలయ కాటేజీల చెంత దైవారాధనలను నేరుగా కల్పించే దళారులు తిరుగుతుంటారు. కుటుంబాలతో వచ్చిన భక్తులను కలిసి ప్యాకేజీ మాట్లాడుకుంటారు. కొండపైకి పంపించేందుకు ఓ బ్యాచ్ ఉండగా, కొండపైన దర్శనానికి పంపించేందుకు మరో బ్యాచ్ పని చేస్తుంటుంది. ఇలా గొలుసుకట్టు వ్యవస్థ నిత్యం కొనసాగుతూనే ఉంది. దర్శనాలకు భక్తులను పంపించే వ్యవస్థ పటిష్ఠంగా లేకపోవడంతో ప్రతి రోజూ ఆలయ ఆదాయానికి గండి పడుతోంది. శ్రావణ మాసంలో దళారుల పంట పండుతోంది.

● హైదరాబాద్ నగరం నుంచి 11 మందితో కూడిన ఓ కుటుంబం ఇటీవల క్షేత్ర సందర్శనకు వచ్చింది. కొండ కింద ఓ ప్రైవేట్ లాడ్జిలో బస చేసి ఉదయాన్నే దైవ దర్శనం చేసుకోవాలని సంకల్పించారు. లాడ్జి వారిని సంప్రదించగా ఆయన ఫోన్ చేసి ఓ వ్యక్తిని పిలిపించి, పరిచయం చేశారు. ఆ వ్యక్తితో కొండపైకి వెళ్లి గంటలోపే దైవ దర్శనం చేసుకొని వచ్చారు. ఇందుకు రూ.1500 చెల్లించారు.

మూడేళ్లుగా దర్శనం టికెట్ల ఆదాయం

శీఘ్ర దర్శనం (టికెట్ ధర రూ.150)	
2023–24	రూ.10,28,91,900
2024–25	రూ.13,59,82,050
2025–26	రూ..12,80,77,800
బ్రేక్ దర్శనం (టికెట్ ధర రూ.300)	
2023–24	రూ.7,62,27,900
2024–25	రూ.7,42,54,700
2025–26	రూ.7,55,04,900

ఈవో వివరణ: దైవదర్శనంలో కొనసాగుతున్న దందాను అరికట్టేందుకు అవసరమైన చర్యలు చేపడతాం. నిఘా వ్యవస్థను పెంపొందిస్తాం. ఈ సమస్యను ట్రస్టుబోర్డు దృష్టికి తెచ్చి కట్టుదిట్టమైన విధానాల అమలుకు ఆదేశిస్తామని ఈవో భవానీశంకర్ తెలిపారు.

వారానికోసారి ప్రత్యేకాధికారులతో సమీక్ష

ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ బి.చంద్రశేఖర్

నల్గొండ సంక్షేమం, న్యూస్‌టుడే: ప్రజావాణి దరఖాస్తులతో పాటు వివిధ పథకాల అమలుపై మండల ప్రత్యేకాధికారులతో ప్రతి సోమవారం లేదా మంగళవారం సమావేశం నిర్వహించనున్నట్లు కలెక్టర్ బి.చంద్రశేఖర్ తెలిపారు. అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల అమలుపై ఎంఎస్‌వోలు, మండల స్థాయిలో తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మండలాధికారులు, మున్సిపల్ కమిషనర్లు వారాంతంలోగా నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం నల్గొండ కలెక్టరేట్‌లో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. జిల్లాలో సీఎం పర్యటించనున్నందున జిల్లా నివేదికతో పాటు నకిరేకల్ నియోజకర్గానికి సంబంధించిన నివేదికను ప్రత్యేకంగా రూపొందించి సమర్పించాలని ఆదేశించారు. సోమవారం జిల్లా స్థాయి ప్రజావాణిలో రెవెన్యూశాఖకు 44 దరఖాస్తులు రాగా ఇతర అన్ని శాఖలకు కలిపి 39 దరఖాస్తులు వచ్చాయి. రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇన్‌ఛార్జి అదనపు కలెక్టర్ ప్రేమ్‌కరణ్ రెడ్డి, డీఆర్‌వో దశరథ, డీఆర్‌డీవో శేఖర్‌రెడ్డి, శిక్షణ సహాయ కలెక్టర్ శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

❖ భూభారతి, అసైన్డ్ భూములు, ఎస్ఐఆర్, రీసర్వే పనులపై అధికారులు ప్రతిరోజు ప్రత్యేక దృష్టి సారించి జాగ్రత్తగా పనిచేయాలని కలెక్టర్ బి.చంద్రశేఖర్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఆర్డీవోలు, తహసీల్దార్లతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో 22ఏ కు సంబంధించిన నిబంధనలను జాగ్రత్తగా అమలు చేయాలని ఆదేశించారు.

రైతేరాజు 6లో..

ITI SPOT ADMISSIONS
ప్రభుత్వం నిర్ణయించిన ఫీజుల ప్రకారం సం॥రమునకు రూ. 16,500/- మాత్రమే. ఈ క్రింది కోర్సులలో ప్రవేశం గలదు. 1) ఫిట్టర్, 2) ఎలక్ట్రానిక్ మెకానిక్ 3) ఎలక్ట్రీషియన్ 4) ప్లంబర్ 5) డిజిల్ మెకానిక్. 6) డ్రాఫ్ట్‌మెన్ సివిల్.
నోట్: COPA (కంప్యూటర్) కోర్సు 1 సం॥కు రూ. 13,200/-లు మాత్రమే.
చివరి తేది: 05-09-2026
మార్కోని ITI, నల్లగొండ
శ్రీ శారద ITI, మిర్యాలగూడ
Cell: 98482 45036, 94900 97071, 94404 05112

(c) eenadu

ఆధునిక సాగుతో అధిక దిగుబడులు

మల్చింగ్ పద్ధతిలో మిరప సాగు

రైతేరాజు

గరిడేపల్లి, న్యూస్‌టుడే: నీటి పొదుపు, కలుపు నియంత్రణ, నాణ్యమైన దిగుబడులు, రాయితీ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని కేవీకే ఉద్యాన విభాగం శాస్త్రవేత్త సీహెచ్.నరేష్ సూచించారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా నీటి కొరతను అధిగమించి సాగు ఖర్చులు తగ్గించుకోవడం, కూలీల కొరతను తట్టుకోవడం, కలుపు మొక్కలను నియంత్రించడం ముఖ్యం. వీటితో పాటు తెగుళ్ల ఉద్ధృతిని అరికట్టాల్సిన అవసరం ఉంది. ఉద్యాన పంటల్లో ప్లాస్టిక్ మల్చింగ్, షేడ్‌నెట్, నెట్ హౌస్, పాలిహౌస్ రక్షిత సాగు పద్ధతులను శాస్త్రీయంగా వినియోగిస్తే నీరు ఆదా చేయవచ్చు. కలుపు నియంత్రణ, పంట నాణ్యత, అధిక దిగుబడులు మెరుగు పర్చుకోవచ్చు.

షేడ్‌నెట్‌తో మొక్కలకు రక్షణ..

అధిక ఉష్ణోగ్రత, తీవ్రమైన సూర్యరశ్మి నుంచి మొక్కలను రక్షణకు షేడ్‌నెట్ నిర్మాణాలు ఉపయోగపడతాయి. కూరగాయల నారు, పూల మొక్కలు, అలంకరణ, నర్సరీ మొక్కలు, సున్నితమైన ఉద్యాన పంటల పెంపకానికి షేడ్‌నెట్ ఉపయోగకరంగా ఉంటుంది. అవసరాన్ని బట్టి నెట్‌లను ఎంపిక చేసుకోవాలి. అన్ని పంటలకు ఒకే రకమైన షేడ్‌నెట్ అనుకూలం కాదు. పంటకు అవసరమైన కాంతి, ఉష్ణోగ్రత, గాలి ప్రసరణ పరిగణలోకి తీసుకుని వినియోగించాలి.

ప్లాస్టిక్ మల్చింగ్‌తో నీటి పొదుపు ఇలా..

పంటల వరుసల మధ్య నేలను ప్లాస్టిక్ మల్చింగ్ షీట్‌ను కప్పడం వల్ల ద్రవ నేలలోని తేమ ఎక్కువ కాలం నిల్వ ఉంటుంది. సూర్యరశ్మి నేరుగా నేలపై పడకుండా ఉండటం వల్ల నీటి ఆవిరి తగ్గి మొక్కలకు అవసరమైన తేమ ఎక్కువ కాలం అందుబాటులో ఉంటుంది. మల్చింగ్ షీట్ నేలను కప్పి ఉంచడంతో కలుపు మొక్కల పెరుగుదల తగ్గుతుంది. దీంతో కూలీల ఖర్చు తగ్గించుకోవచ్చు. డ్రిప్ ఇరిగేషన్‌తో పాటు ఫెర్టిగేషన్ విధానాన్ని మల్చింగ్‌తో అనుసంధానం చేస్తే నీరు ఎరువులను మొక్కల వేర్ల ప్రాంతానికి అందించవచ్చు. ప్లాస్టిక్ మల్చింగ్ ఖర్చు పంట రకం, షీట్ మందం, వెడల్పు, పొలం అమరిక, స్థానిక కూలీల ధరలను బట్టి మారుతుంది. సాధారణంగా 30-50 మైక్రాన్ మల్చింగ్ షీట్‌ను ఉపయోగిస్తే ఎకరానికి రూ.12-22 వేల వరకు ఖర్చు అవుతుంది.

రాయితీతో రైతుకు లాభం..

ఉద్యాన పంటలను ప్రోత్సహించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రక్షిత సాగు నిర్మాణాలకు రాయితీ అందిస్తున్నాయి. షేడ్‌నెట్, నెట్ హౌస్, పాలిహౌస్, లో టన్నెల్, వాక్-ఇన్ టన్నెల్, రక్షిత నర్సరీల నిర్మాణానికి రాయితీ పొందే అవకాశం ఉంది. రాయితీ శాతం యూనిట్ ఖర్చు, అర్హత, నిబంధనల ప్రకారం అందిస్తారు. నిర్మాణాలు అవసరమైన రైతులు ఉద్యాన శాఖ అధికారులను సంప్రదిస్తే మార్గదర్శకాలు వివరిస్తారు. నర్సరీ మొక్కల సాంద్రత, డ్రిప్ ఇరిగేషన్, ఫెర్టిగేషన్, సమగ్ర పురుగు-తెగుళ్ల యాజమాన్యం పాటిస్తే లాభం ఉంటుంది.

సందేహం.. సమాధానం

? పత్తిలో వేరుకుళ్లు ఆశించి మొక్క ఎండిపోతుంది. నివారణ ఎలా. – పి.రమేష్‌రెడ్డి, మల్లారెడ్డిగూడెం

✔ వేరుకుళ్ల నివారణకు కాపర్ ఆక్సిక్లోరైడ్ 3 గ్రా, ప్లాంటామైసిన్ 0.3 గ్రా, లీటరు నీటిలో కలిపిన ద్రావణాన్ని తెగులు సోకిన మొక్కల మొదట చుట్టూ పోయాలి.

? వరి పొలం వేసి 20 రోజులు అయింది. కాండం తొలిచే పురుగు నివారణకు చర్యలు ఏమిటి? – జి.లక్ష్మణ్, చిమిర్యాల

✔ కార్బోఫ్యూరాన్ 3 జి. గుళికలను 10 కిలోలు లేదా కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 4 జి గుళికలు 8 కిలోలు 25 కిలోల ఇసుకలో కలిపి చల్లుకోవాలి.

? బొప్పాయి సాగు చేయాలనుకుంటున్నాం. ఎప్పుడు నాటుకోవచ్చు. – డి.నాగేష్ మర్రిగూడ

✔ కొత్తగా బొప్పాయి నాటేందుకు ఆగస్టు, సెప్టెంబరు అనుకూలం. మొక్కల మధ్య 1.8 మీటర్ల దూరం ఉండేలా 40×40×40 సెం.మీ గుంతలు తీసి నాటుకోవాలి.

? బంతి మొక్కలు ఎప్పుడు నాటుకోవచ్చు. ఎన్ని రోజుల వయస్సు నారు నాటుకోవాలి. మొక్కలు ఎక్కడ దొరుకుతాయి. – పి.రవినాయక్, బీబీగూడెం

✔ బంతి మొక్కలు సెప్టెంబరు 15 వరకు నాటుకోవచ్చు. 25-30 రోజుల వయస్సు నారు నాటుకోవచ్చు. గడ్డిపల్లి కేవీకేలో నాణ్యమైన మొక్కలు లభ్యమవుతాయి.

కిరణ్ కుమార్

రైతులు వాట్సప్ ద్వారా అడిగిన సమస్యలకు గడ్డిపల్లి కేవీకే మృత్తికా విభాగం శాస్త్రవేత్త అరిగేలా కిరణ్‌కుమార్ సమాధానాలిస్తారు. -గరిడేపల్లి, న్యూస్‌టుడే:

78939 89055

ఎరువుల ఎంపిక విధానం ముఖ్యం

గరిడేపల్లి, న్యూస్‌టుడే: వివిధ రకాల పంటల్లో ఎరువుల ఎంపిక విధానం ముఖ్యమైందని కేవీకే మృత్తికా విభాగం శాస్త్రవేత్త అరిగేల కిరణ్ సూచించారు. నత్రజని, అమ్మోనియం సల్ఫేట్, కాల్షియం నైట్రేట్ వంటివి ఎరువుల రూపంలో లభ్యమవుతాయి. నత్రజని రసాయన పరంగా యూరియా రూపంలో ఉంటుంది. ఇసుక పాళ్లు ఎక్కువగా ఉన్న మాగాణి భూముల్లో మినహా మిగతా అన్ని నేలలకు పంటలకు దుక్కిలో, దమ్ములో పైపాటుగా వేసుకోవచ్చు. ఆమ్ల భూములకు సల్ఫైడ్ ప్రమాదం ఉన్న భూములకు అమ్మోనియం సల్ఫేట్ వాడకూడదు. క్షార గుణం నేలలకు, సున్నపు నేలలకు ఎప్పుడైనా వేసుకోవచ్చు. కాల్షియం అమ్మోనియం నైట్రేట్‌ను వరి చిరుపొట్ట దశలో వేయాలి. ఫాస్ఫేట్ ఎరువుల్లో సూపర్‌ఫాస్ఫేట్ ప్రధానమైంది. ఇది సాధారణంగా అన్ని పైర్లకు వేసుకోవాలి. కాంప్లెక్స్ ఎరువుల్లో అమ్మోనియం ఫాస్ఫేట్ అన్ని నేలలకు అన్ని పైర్లకు వాడవచ్చు. నైట్రోఫాస్ఫేట్లు మెట్ట ఆరుతడి పంటలకు ఎర్ర నేలలకు సాధారణ రసాయన స్థితిగల నేలలకు కొద్దిపాటి ఆమ్ల గుణం ఉన్న నేలలకు ఉపయోగపడుతుంది. నైట్రో ఫాస్ఫేట్ వరికి వేసుకోవచ్చు.

పశువులు సకాలంలో ఎదకు రావడానికి..

త్రిపురారం, న్యూస్‌టుడే: పశువులు సకాలంలో ఎదకు రావడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను మండల పశువైద్యాధికారి నాగేంద్ర తెలియజేశారు. వర్షం, చలి కాలంలో సాధారణంగా ఆరోగ్యంగా ఉన్న పశువులు ఎదకు వస్తాయి. 70 శాతం పశువులకు సమస్యలు ఉంటాయి. మొదట నట్టల మందు తాగించాలి. ఆల్‌బెండజోల్, ఫెన్ బెండజోల్ మందు తాగించాలి. పచ్చి గడ్డి అందుబాటులో ఉండేలా చూడాలి. ఒక పశువుకు 30 కిలోల పచ్చి గడ్డి ఒక రోజులో ఇవ్వాలి. మినరల్ మిక్చర్, మందులు ఇవ్వాలి.

ఆర్టీసీలో సంఘం ఎన్నికలకు కసరత్తు

నల్గొండ ఆర్టీసీ ప్రాంగణంలో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

భానుపురి, కుడకుడరోడ్డు, న్యూస్‌టుడే: ఆర్టీసీలో గుర్తింపు సంఘం ఎన్నికల ప్రకటన ఈ నెలాఖరులోగా విడుదల కానుంది. కార్మికులు ఎనిమిదేళ్లుగా ఎదురుచూస్తున్న గుర్తింపు సంఘం ఎన్నికలకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఇప్పటికే నల్గొండ రీజియన్ పరిధిలోని ఆర్టీసీ ప్రధాన సంఘాలన్నీ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించాయి. ఉమ్మడి జిల్లాలోని ఏడు డిపోలలో టీఎంయూ, ఈయూ, ఎస్‌డబ్ల్యూఎఫ్, ఎన్ఎంయూ, ఐఎన్‌టీయూసీ కార్మిక సంఘాలున్నాయి. 2018లో ఈ ఎన్నికలు జరగాల్సి ఉండగా అప్పటి ప్రభుత్వం నిర్వహించలేదు.

డిపో	డ్రైవర్లు	కండక్టర్లు
దేవరకొండ	144	146
నల్గొండ	70	185
నార్కట్‌పల్లి	38	56
మిర్యాలగూడ	121	110
యాదగిరిగుట్ట	132	145
కోదాడ	114	98
సూర్యాపేట	55	208

గుర్తింపు ఇలా..: ఆర్టీసీలో అనేక కార్మిక సంఘాలు ఉన్నప్పటికీ ఎన్నికల్లో గెలిచిన సంఘాలనే గుర్తింపు సంఘంగా పరిగణిస్తారు. ఈ గుర్తింపు సంఘాలు రీజియన్, రాష్ట్రస్థాయిలో ఉంటాయి. రెండింటికీ వేర్వేరు బ్యాలెట్ పత్రాలతో ఎన్నికలు నిర్వహిస్తారు. కార్మికుల వేతనాలు, బోనస్‌లు, డీఏలు, సర్వీస్ నిబంధనలు తదితర సమస్యలపై సంస్థ యాజమాన్యం ప్రభుత్వంతో చర్చలు జరిపే చట్టబద్ధమైన హక్కు ఈ సంఘానికే ఉంటుంది. కార్మికుల తరపున ఒప్పందాలు చేసుకోవడంలోనూ గుర్తింపు సంఘం కీలకంగా వ్యవహరిస్తోంది. రీజియన్‌లో పనిచేసే అధికారి స్థాయి మినహా మిగిలిన ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులందరికీ ఓటు హక్కు ఉంటుంది.

త్వరగా ఎన్నికలు పూర్తి చేయాలి...

–బత్తుల సుధాకర్, ఎస్‌డబ్ల్యూఎఫ్ రీజియన్ కార్యదర్శి, నల్గొండ

ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేయాలంటే గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహిస్తామని ప్రభుత్వం చెబుతుంది. విలీన ప్రక్రియ త్వరగా పూర్తికావాలంటే ఆర్టీసీలో ఎన్నికలు త్వరగా జరగాలి. కార్మికులకు సంపూర్ణ ఉద్యోగ భద్రత కల్పించాలి. పనిభారాలు తగ్గించాలి. సంస్థలో డిపో స్పేర్ విధానాన్ని ఎత్తివేయాలి.

మూడింటా లోటే

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: వర్షాకాలం ప్రారంభమై రెండు నెలలు దాటుతుంది. ఆగస్టు నెల సైతం ముగిసిపోయింది. కానీ ఉమ్మడి జిల్లాలో సరైన వర్షాలు మాత్రం కురవలేదు. దీంతో భూగర్భ జలాలు తగ్గి అటు రైతులు, ఇటు సాధారణ ప్రజలు సైతం ఇబ్బందులు పడుతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆగస్టు 31 నాటికి కురవాల్సిన దాని కంటే 30శాతం తక్కువగా వర్షపాతం నమోదైంది. దీంతో మూడు జిల్లాల్లో లోటు వర్షపాతం కలిగిన జిల్లాల జాబితాలోనే నిలిచాయి.

◆ జిల్లాల వారీగా సోమవారం వరకు కురవాల్సిన, కురిసిన వర్షపాతం వివరాలు (మిల్లీ మీటర్లలో)

జిల్లా	కురవాల్సింది	కురిసింది	తేడా(శాతంలో)
నల్గొండ	337.2	231.4	31.0
సూర్యాపేట	422.4	279.8	34.0
యాదాద్రి	375.9	245.5	35.0

✦ నల్గొండ జిల్లాలో మొత్తం 33 మండలాలు ఉండగా కేతేపల్లి మండలంలో 70 శాతం తక్కువ వర్షపాతం నమోదుతో అధిక లోటు వర్షపాతం కలిగిన మండలాల జాబితాలో నిలవగా 23 మండలాల్లో లోటు వర్షపాతం, 9 మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. దామరచర్ల మండలంలో మాత్రమే 3శాతం అధిక వర్షపాతం నమోదు కాగా మిగిలిన అన్ని మండలాల్లో కురవాల్సిన దాని కంటే తక్కువ వర్షపాతం నమోదైంది.

✦ సూర్యాపేట జిల్లాలో మొత్తం 23 మండలాలు ఉండగా 60 శాతం తక్కువ వర్షపాతంతో పాలకీడు మండలంలో అధిక లోటు వర్షపాతం నమోదైంది. 18 మండలాల్లో లోటు వర్షపాతం, నాలుగు మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. మఠంపల్లి మండలంలో 302.0 మిల్లీ మీటర్లకు అదే స్థాయిలో వర్షం కురవగా మిగిలిన అన్ని మండలాల్లో తక్కువ వర్షపాతమే నమోదైంది.

✦ యాదాద్రి జిల్లాలో 17 మండలాలు ఉండగా రెండు మండలాల్లో మాత్రమే సాధారణ వర్షపాతం నమోదు కాగా 15 మండలాల్లో లోటు వర్షపాతం నమోదైంది. అన్ని మండలాల్లోనూ కురవాల్సిన దాని కంటే తక్కువ వర్షపాతమే నమోదైంది.

హాయ్... పుస్తకాలు అందాయా..!

మిర్యాలగూడ, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే నిరుపేద విద్యార్థులకు ప్రభుత్వం అందించే సౌకర్యాలు వారికి అందుతున్నాయా లేదా అనే విషయాన్ని తెలుసుకునేందుకు విద్యాశాఖ ఉన్నతాధికారులు ప్రత్యేక కార్యాచరణ చేపట్టారు. ప్రభుత్వ పథకాల్లో పారదర్శకతను తెలుసుకునే పనిలో రాష్ట్ర విద్యాశాఖ నిమగ్నమైంది. ప్రస్తుత విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉచితంగా పాఠ్య, రాత పుస్తకాలను పంపిణీ చేశారు. విద్యార్థులకు వాటిని పంపిణీ చేశారా లేదా అనే విషయాలను విద్యాశాఖ అధికారులు తెలుసుకుంటున్నారు.

వర్క్ బుక్స్ మినహా...

ఉమ్మడి జిల్లాలో 1733 ప్రభుత్వ పాఠశాలల్లో 1,89,350 మంది విద్యార్థులు చదువుతున్నారు. వారందరి తల్లిదండ్రుల చరవాణులకు మీ సేవ తెలంగాణ ద్వారా సందేశాలను పంపించి అభిప్రాయాలను సేకరిస్తున్నారు. జిల్లాలో వర్క్ బుక్స్ మినహా మిగిలిన పాఠ్య, రాత పుస్తకాలు విద్యార్థులకు చేరాయి. అక్కడక్కడ కొంత కొరతగా నిలిచినా అధికారులు అవసరమైన పుస్తకాలను తెప్పించే ప్రయత్నాల్లో ఉన్నారు. పాఠశాలల్లోని సమస్యలపై విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి ఎప్పటికప్పుడు అభిప్రాయాలు సేకరించాలని సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష సమావేశంలో ఆదేశించడంతో ఈ ప్రక్రియను మొదట చేపట్టినట్లు జిల్లా విద్యాశాఖ అధికారులు పేర్కొంటున్నారు.

ప్రశ్నావళి రూపంలో...

పాఠ్య, నోట్ పుస్తకాలు అందాయా అంటూ ప్రశ్నావళి రూపం లో విద్యార్థుల తల్లిదండ్రుల చరవాణులకు వాట్సాప్ సందేశాలను పంపిస్తున్నారు. సందేశంలో విద్యార్థుల పేర్లు, తరగతి, పాఠశాల గ్రామం, మండలం పేరు వంటి పూర్తి వివరాలతో సం దేశాలు చేరవేస్తున్నారు. అయితే కొన్ని మాత్రమే అందాయి, పూర్తిగా అందలేదనే ఆప్షన్ల ద్వారా తల్లిదండ్రుల నుంచి అభిప్రాయాలను స్వీకరిస్తున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు కచ్చితమైన సమాధానాలు పంపితే భవిష్యత్తులో తీసుకోవాల్సిన చర్యల గురించి విద్యాశాఖ ఉన్నతాధికారులు నిర్ణయాలు తీసుకోనున్నారు.

వర్క్‌బుక్ రూపకల్పనలో మోత్కూరు ఉపాధ్యాయుడు


మేకల శశికుమార్

మోత్కూరు, న్యూస్‌టుడే: రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ మండలి(ఎస్‌సీఈఆర్టీ) రూపొందించి, ప్రచురించిన 8వ తరగతి ఆంగ్ల వర్క్‌బుక్ రూపకల్పనలో మోత్కూరు ఉన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయుడు మేకల శశికుమార్‌కు ఆంగ్ల కంటెంట్ డెవలపర్‌గా అవకాశం లభించింది. విద్యార్థుల అభివృద్ధి, ఆత్మవిశ్వాసం, అంతర్గతశక్తి అనే అంశాలను ప్రోత్సహించేలా శశికుమార్ రచించిన 'డిస్కవర్ ద ట్రెజర్ విత్ ఇన్ యూ' కవితను 8వ తరగతి వర్క్‌బుక్‌లో ప్రచురించారు. ఈ కవిత విద్యార్థులు తమలో దాగిఉన్న శక్తి, సామర్థ్యాలను అన్వేషించుకోవాలని ప్రేరణనిస్తుంది. శశికుమార్ రచన వర్క్‌బుక్‌లో ప్రచురితమైన సందర్భాన్ని పురస్కరించుకుని పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆయనను సోమవారం ఘనంగా సన్మానించారు.

పురుగుమందు తాగి మహిళ ఆత్మహత్య

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: మనస్తాపానికి గురై పురుగు మందు తాగి మహిళ బలవన్మరణానికి పాల్పడిన ఘటన మిర్యాలగూడ మండల పరిధిలో చోటు చేసుకుంది. గ్రామీణ ఎస్సై లక్ష్మయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని వెంకటాద్రిపాలెం గ్రామం దుర్గానగర్‌కు చెందిన కొమెర సైదమ్మ (39) పట్టణంలోని ఓ హోటల్‌లో పని చేస్తూ మద్యానికి బానిసైంది. దీంతో భర్త గణేష్ ఎదుట తాగొద్దని వారించడంతో మనస్తాపానికి గురై ఆదివారం సాయంత్రం పురుగు మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు తక్షణమే ప్రాంతీయ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా అదే రోజు రాత్రి మృతి చెందింది. కుటుంబ సభ్యులు సోమవారం అందించిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో మరొకరు..

నిడమనూరు, న్యూస్‌టుడే: గుర్తుతెలియని మాత్రలు మింగి ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్సై విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం...నిడమనూరుకు చెందిన గోగుల లింగయ్య కుమార్తె సుజాత(37)ను నార్కెట్‌పల్లి మండలం ఎల్లారెడ్డిగూడెం గ్రామానికి చెందిన పరికుప్పల కృష్ణకు ఇచ్చి వివాహం చేశారు. కాగా వారి కుటుంబ ఆర్థిక ఇబ్బందులతో జీవితంపై ఆమె విరక్తి చెందింది. గత శుక్రవారం ఎల్లారెడ్డిగూడెం నుంచి నిడమనూరులోని ఆమె తల్లిదండ్రుల ఇంటికి వచ్చింది. వస్తూ మార్గమధ్యలో గుర్తు తెలియని మాత్రలు మింగి ఆత్మహత్యకు యత్నించినట్లు సుజాత తల్లిదండ్రులకు చెప్పింది. దీంతో వారు వెంటనే హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతిచెందింది. ఈ ఘటనపై ఆమె తండ్రి లింగయ్య సోమవారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

తమిళనాడు సీఎంని కలిసిన ఎంపీ చామల

హైదరాబాద్, న్యూస్‌టుడే: తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్‌ని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం చెన్నైలో జరిగిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఆన్ హౌసింగ్ అండ్ అర్బన్ అఫైర్స్ స్టడీ టూర్‌లో చామల పాల్గొన్నారు. అనంతరం సీఎం విజయ్‌ని కలిసి.. తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల మధ్య పరస్పర సహకార అంశాలపై చర్చించారు.

తమిళనాడు సీఎం విజయ్‌తో ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

పెండింగ్ ప్రాజెక్టులపై అసెంబ్లీలో చర్చించాలి

ఐక్యత చాటుతున్న అనురాధ, నరసింహారావు, సీతారాములు, జాన్‌వెస్లీ, జహంగీర్, వీరయ్య తదితరులు..

నల్లకుంట, న్యూస్‌టుడే: యాదాద్రి జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులపై అసెంబ్లీలో చర్చించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. పూర్తిస్థాయిలో నిధులు విడుదల చేసి ప్రాజెక్టులు పూర్తి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. సీపీఎం యాదాద్రి భువనగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పెండింగ్ ప్రాజెక్టుల సాధన కోసం చేపట్టిన పాదయాత్ర ముగింపు సందర్భంగా సోమవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో నిర్వహించిన మహాధర్నాలో ఆయన మాట్లాడారు. ప్రాణహిత-చేవెళ్ల రీ డిజైన్ కారణంగా తిమ్మాపూర్, చౌక్లానాయక్ తండా, లప్పనాయక్ తండాలు పూర్తిగా ముంపునకు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. అందుకోసం నష్టపరిహారం రూ.420 కోట్లు ఇవ్వాల్సి ఉండగా.. కేవలం రూ.206 కోట్లు విడుదల చేసి చేతులు దులుపుకొందన్నారు. సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎస్.వీరయ్య మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, చెరుపల్లి సీతారాములు, జిల్లా కార్యదర్శి జహంగీర్, డీజీ.నరసింహారావు, కె.నరసింహ, అనురాధ, ఆర్.వెంకట్‌రాములు, సైల్కాబ్‌బాబు, పైళ్ల ఆశయ్య, వెంకటేశ్, బాలరాజు, మల్లేశం, పాండు, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

'కాంగ్రెస్ మోసపూరిత హామీలపై నిరసనలు'

మాట్లాడుతున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, చిత్రంలో మాజీ ఎమ్మెల్యేలు భాస్కర్‌రావు, విజయసింహారెడ్డి, భూపాల్‌రెడ్డి

మిర్యాలగూడ, న్యూస్‌టుడే: కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన మోసపూరిత హామీలపై ఈ నెల 1 నుంచి 8 వరకు రాష్ట్ర వ్యాప్తంగా భారాస నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి తెలిపారు. మిర్యాలగూడలోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు 420 హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయకుండా ప్రజలను మోసగించిందని అన్నారు. మిర్యాలగూడ పట్టణంలో ఈనెల 3న చేపట్టనున్న రైతు సదస్సుకు భారాస వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరవుతారని చెప్పారు. పెద్ద ఎత్తున రైతులు హాజరు కావాలని కోరారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు నల్లమోతు భాస్కర్‌రావు, తిప్పన విజయసింహారెడ్డి, కంచర్ల భూపాల్‌రెడ్డి, నాయకులు చింతరెడ్డి శ్రీనివాసరెడ్డి, నారాయణరెడ్డి, యడవల్లి శ్రీనివాసరెడ్డి, నాగార్జునచారి, చిట్టిబాబు నాయక్, బాలాజీ నాయక్, వీరకోటిరెడ్డి, సేవ్యా, చౌగాని భిక్షం తదితరులు పాల్గొన్నారు.

బాలికకు గర్భం.. యువకుడిపై పోక్సో కేసు నమోదు

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే: తెలంగాణ రాష్ట్రం కోదాడ పట్టణానికి చెందిన పదో తరగతి బాలిక గర్భిణి అయిన ఘటనపై విజయవాడ గవర్నర్‌పేట పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. బాలికను వైద్యం నిమిత్తం కుటుంబ సభ్యులు సోమవారం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తీసుకొచ్చారు. ఆమె వయస్సు 15 సంవత్సరాలు, ఐదో నెల గర్భిణి కావడంతో ఆసుపత్రి సిబ్బంది ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వారి ఆదేశాల మేరకు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఆసుపత్రికి చేరుకుని బాలిక కుటుంబ సభ్యుల నుంచి వివరాలు సేకరించారు. ఆమెకు పరిచయమైన యువకుడే దీనికి కారణమని పోలీసులు గుర్తించారు. దీనికి సంబంధించిన పూర్తి వివరాలు చెప్పలేకపోవడంతో.. వారిచ్చిన సమాచారం మేరకు పోక్సో సెక్షన్ కింద జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి కోదాడ బదిలీ చేశారు.

ఉరేసుకొని వ్యక్తి బలవన్మరణం

గుర్రంపోడు, న్యూస్‌టుడే: ఉరేసుకొని ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. గుర్రంపోడు మండలం పిట్టలగూడెం గ్రామానికి చెందిన భైరి యాదగిరి(43) ఆదివారం రాత్రి ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడగా సోమవారం ఉదయం గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై వెంకన్న, గ్రామస్థుల కథనం ప్రకారం.. యాదగిరి నిత్యం మద్యం మత్తులో ఉంటూ భార్యతో వాగ్వాదం పెట్టుకోవడంతో ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. ఆదివారం రాత్రి ఇంట్లో ఒక్కడే ఉండటంతో మనస్తాపానికి గురై ఇంట్లోనే బలవన్మరణానికి పాల్పడినట్లు గుర్తించారు. యాదగిరి సోదరుడు కృష్ణయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అత్యాచారం ఘటనలో పదేళ్ల జైలు

నల్గొండ లీగల్, న్యూస్‌టుడే: బాలికపై అత్యాచారానికి పాల్పడిన కేసులో ముద్దాయి మూడవత్ మల్లేశ్‌కు పదేళ్ల జైలుశిక్ష విధిస్తూ నల్గొండ పోక్సో ప్రత్యేక న్యాయస్థాన న్యాయమూర్తి విశ్వనాథ్‌కులకర్ణి దిలీప్‌రావ్ సోమవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. డిండి మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ మూడవత్ మల్లేశ్ ఆటోలో పరిచయమైన మండలానికి చెందిన బాలికకు మాయమాటలు చెప్పి లోబరచుకున్నాడు. ఈ విషయం ఎవరికైనా చెబితే చంపేస్తానని బెదిరిస్తూ బాలికపై పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డాడు. అతడి బెదిరింపులు భరించలేక బాలిక 2020 సెప్టెంబరు 8న పురుగుమందు తాగింది. ఆసుపత్రిలో చికిత్స అనంతరం కోలుకుంది. వైద్యుల పరీక్షలో బాలిక మూడు నెలల గర్భిణిగా తేలింది. నిందితుడు తనకు సంబంధం లేదని చెప్పడంతో డిండి పోలీసులు మల్లేశ్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదుచేశారు. పోలీసులు దర్యాప్తు ముగించి ఛార్జిషీట్‌ను కోర్టులో దాఖలు చేశారు. న్యాయస్థాన విచారణలో నేరనిర్ధారణ కావడంతో మల్లేశ్‌కు పదేళ్ల జైలుశిక్ష, రూ.5 వేల జరిమానాను న్యాయమూర్తి విధించారు. చట్ట ప్రకారం ఆ బాలికకు రూ.ఏడులక్షల నష్టపరిహారాన్నిప్రభుత్వం ఇవ్వాలని కోర్టు ఆదేశించింది. ప్రాసిక్యూషన్ తరపున ప్రత్యేక పీపీ రంజిత్‌కుమార్ వాదించారు.

167 రహదారి ఎన్‌హెచ్‌ఏఐకి బదలాయింపు

కోదాడ నుంచి జడ్చర్ల వెళ్లే 167 రహదారి

గరిడేపల్లి, న్యూస్‌టుడే: కోదాడ నుంచి మిర్యాలగూడ, హాలియా మీదుగా వెళ్లే జడ్చర్ల రహదారి(167)ని జాతీయ రహదారుల ప్రాధికారిక సంస్థకు బదలాయిస్తున్నారు. ఈ మేరకు ఈ నెల మొదటి వారంలో గెజిట్ విడుదల చేశారు. ఇంతకాలం రోడ్డు విస్తరణ పనులు చేయించిన జాతీయ రహదారుల శాఖ పర్యవేక్షణ చేసేది. దాంతో పాటు గుత్తేదారుకు ఇచ్చిన ఐదేళ్ల నిర్వహణ గడువు ముగియడంతో ఈ మేరకు కేంద్రం నిర్ణయం తీసుకుంది. కొద్ది రోజుల్లో సంబంధిత ఉన్నతాధికారుల సమక్షంలో అధికారికంగా నిర్వహణ బాధ్యతలను స్వీకరించనుంది. కోదాడ నుంచి జడ్చర్ల వరకు 234 కి.మీ రహదారిని 2017-18లో జాతీయ రహదారుల శాఖ విస్తరించింది.

గెజిట్ విడుదల...: ఇప్పటి వరకు కేంద్ర రహదారుల మంత్రిత్వ శాఖ పర్యవేక్షణలో గుత్తేదారు పని చేశారు. రహదారిపై గ్రామాల పరిధిలోని సెంట్రల్ లైటింగ్, రోడ్ల నిర్వహణ బాధ్యతలను వారే నిర్వహించేవారు. నాలుగేళ్ల నిర్వహణ జూన్‌తో పూర్తి కావడంతో బాధ్యతల నుంచి తప్పుకొన్నారు. దాంతో జులైలో అధికారులు రహదారిని పరిశీలించి అనంతరం ఆగస్టులో జాతీయ రహదారుల ప్రాధికారిక సంస్థకు బదలాయిస్తూ గెజిట్ విడుదల చేశారు. అంటే వారు బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి వీధి దీపాల బిల్లు, రోడ్డు నిర్వహణ చేపట్టనున్నారు. స్వల్పకాలిక నిర్వహణకు మరోసారి టెండర్ వేసి నాలుగు వరుసల రహదారి వేసే వరకు పొడిగిస్తూ నిర్వహణ చేపడతారు. గతంలో విస్తరణ సమయంలో 10 మీటర్ల తారు రోడ్డు వేశారు. గ్రామాల పరిధిలో పలుచోట్ల నాలుగు వరుసల రహదారి, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేశారు. రోడ్డును 100 అడుగుల మేర తీసుకున్నారు.

నాలుగు వరుసలకు ప్రతిపాదనలు...

ఎన్‌హెచ్‌ఏఐ ఆధ్వర్యంలో ప్రస్తుతం ఉన్న 10 మీటర్ల రహదారిని నాలుగైదు ఏళ్లలో నాలుగు వరుసలుగా విస్తరించనున్నట్లు అధికారులు తెలిపారు. 167 జాతీయ రహదారి పూర్తి దూరం సుమారు 483 కి.మీ. ఇందులో తెలంగాణలో 300 కి.మీ ఉండగా అందులో 2018లో విస్తరించిన జడ్చర్ల నుంచి కోదాడ వరకు 234 కి.మీ ఉంటుంది. ఈ మార్గంలో ఇప్పటికే గుడబెల్లూరు నుంచి మహబూబ్‌నగర్ వరకు నాలుగు వరుసల రహదారి నిర్మాణానికి టెం డర్ ప్రక్రియ పూర్తయి భూమి సేకరణ జరుగుతుంది. తర్వాత మహబూబ్‌నగర్ నుంచి జడ్చర్లకు అనంతరం జడ్చర్ల నుంచి కోదాడకు మరో నాలుగైదు ఏళ్లలో నాలుగు వరుసల రహదారి వేసే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు. ఈ రహదారిపై వాహనాల రద్దీ పెరిగినందున త్వరలోనే నాలుగు వరుసల రోడ్డుకు నిధులు మం జూరు అవుతాయని ఉన్నతాధికారి ఒకరు వెల్లడించారు.

EENADU eClassifieds

TO LET

సాయిభవాని జనరిక్&ఫార్మా మెడికల్&జనరల్ స్టోర్స్, రామగిరి, నల్లగొండ తక్షణం అద్దెకు/లీజుకు ఇవ్వబడును. (2-3 లక్షల స్టాక్ కలదు) మరియు 1-2 సంవత్సరాల అనుభవం గల ఫుల్/పార్ట్‌టైం సిబ్బంది కావలెను. 99859 24629.

JOBS

ప్రముఖ సోలార్ కంపెనీలో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. నెలకు 20వేలు+ ఇన్సెంటివ్స్. మీ మండలాలలో, పట్టణాలలో పనిచేయాలి. ✆ 9866570239, 9347319131

నల్లగొండపట్టణంలో Climatop బ్రాండ్ క్లీనింగ్ ప్రొడక్ట్సునందు మార్కెటింగ్‌పర్సన్,ఆఫీసులో సేల్స్‌పర్సన్ కావలెను. Age:19-26. 9347745072.

నార్కట్‌పల్లి వద్దగల పెట్రోల్ బంక్‌లో పనిచేయుటకు మేనేజర్ & బాయ్స్ కావలెను. మంచి జీతం ఇవ్వబడును. సంప్ర|| 99590 66588, 98854 12195.

సుధా బ్యాంక్ తిరుమలగిరి పట్టణ బ్రాంచ్, సూర్యాపేట జిల్లాలో క్లర్క్-కమ్ క్యాషియర్‌గా పనిచేయుటకు ఏదైనా డిగ్రీ మరియు కంప్యూటర్ నైపుణ్యం కలిగిన యువతీ, యువకులు కావలెను. వెంటనే md@sudha.bank.inకు మీ బయోడేటా పంపగలరు. సెల్: 91333 72508.

DRIVERS

సూర్యాపేటలోఉండి కారు డ్రైవింగ్ అనుభవం ఉన్న డ్రైవర్ కావలెను.మంచిజీతం షెల్టర్ ఇవ్వబడును. సెల్:6300155438, 6300955438.

Book Your 5 Lines Classified Advertisement for B/W 355/- COLOUR 440/- (GST 5% Extra) Contact 8008116681

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ఈనాడు

దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు

Cell: 80081 16681

ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి

Cell: 99080 16689

నల్గొండ

•నల్గొండ •మునుగోడు •నకిరేకల్

కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన

నకిరేకల్ ప్రధాన కూడలిలో రాస్తారోకో చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నకిరేకల్, న్యూస్‌టుడే: దిల్లీలో విద్యార్థుల కోసం శాంతియుతంగా ఉద్యమించిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని భాజపా ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేసిందని కాంగ్రెస్ నాయకులు నిరసన తెలిపారు. నకిరేకల్ ప్రధాన కూడలిలో సోమవారం బైఠాయించి రాస్తారోకో చేశారు. రాహుల్‌గాంధీ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. పట్టణ, మండల కాంగ్రెస్ అధ్యక్షులు లింగాల వెంకన్న, గాదగోని కొండయ్య, టీపీసీసీ ప్రతినిధి నకిరేకంటి ఏసు పాదం, నాయకులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా గుంత

నగరంలోని జనరల్ ఆసుపత్రి ఎదుట ప్రధాన రహదారిలో కొంత కాలం క్రితం భూగర్భ డ్రైనేజీ పనుల కోసం గుంతను తవ్వారు. మట్టిని పక్కనే కుప్పగా పోశారు. మట్టికుప్ప గట్టి పడి నునుపుగా మారింది. గుంత తవ్విన చోట మలుపు ఉండటంతో పక్కనుంచే ద్విచక్ర వాహనదారులు రాకపోకలు సాగిస్తున్నారు. నునుపుగా ఉన్న మట్టి కుప్ప వద్ద వాహనదారులు ఏమాత్రం అదుపుతప్పినా అందులో పడిపోయే ప్రమాదం ఉంది. అధికారులు దీనిపై దృష్టిసారించాలని ప్రజలు కోరుతున్నారు. -ఈనాడు, నల్గొండ

బహిరంగ సభ విజయవంతం చేయాలి

నకిరేకల్, న్యూస్‌టుడే: సెప్టెంబరు 5న నకిరేకల్‌లో సీఎం రేవంత్ రెడ్డి పర్యటన, బహిరంగ సభను పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాదగోని కొండయ్య అన్నారు. స్థానిక పన్నాలగూడలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో సోమవారం మాట్లాడారు. ప్రతి గ్రామం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సీఎం సభకు తరలివచ్చే విధంగా కృషి చేయాలన్నారు. సీఎం రాకతో నియోజకవర్గ అభివృద్ధి మరింత వేగవంతమవుతుందన్నారు. ఈ సమావేశంలో టీపీసీసీ ప్రతినిధి ఏసుపాదం, పీఏసీఎస్ ఛైర్మన్ వెంకటేశ్వరరావు, నకిరేకంటి నరేందర్, వీరార్జున్‌రెడ్డి, వలిశెట్టి స్వప్న తదితరులు పాల్గొన్నారు.

సామూహిక జన్మదిన వేడుకలు

నకిరేకల్, న్యూస్‌టుడే: విశ్రాంత ఉద్యోగుల సామూహిక జన్మదిన వేడుకలను నకిరేకల్‌లోని విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆగస్టు నెలలో పుట్టిన రోజులున్న విశ్రాంత ఉద్యోగులందరికీ ఒకేసారి సంఘం ఆధ్వర్యంలో వేడుక నిర్వహిస్తున్నామని

కేకు కోస్తున్న విశ్రాంత ఉద్యోగులు

సంఘం అధ్యక్షుడు కందాళ పాపిరెడ్డి చెప్పారు. ఇది విశ్రాంత ఉద్యోగుల్లో ఐక్యతను, సంఘం తమవెంట ఉందన్న భరోసా కల్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు కందుల సోమయ్య, చిక్కు రవి, పొతుల వెంకటనారాయణ, రామచంద్రయ్య, చంద్రమౌళి, కె.భిక్షంరెడ్డి, టి.చంద్రయ్య, ఎస్.ఉత్తర, కడారు అనిత తదితరులు పాల్గొన్నారు.

గుప్తనిధుల కోసం తవ్వకాలు

మర్రిగూడ, న్యూస్‌టుడే: గత కొంతకాలంగా మండలంలో కొంతమంది గుర్తు తెలియని దుండగులు గుప్తనిధుల కోసం ప్రకృతి సంపదను నాశనం చేస్తున్నారు. రాంరెడ్డిపల్లి గ్రామ పరిధిలోని తానేదారుపల్లి గ్రామ శివారు ఈర్ల గుట్ట సమీప వట్టికోటి మల్లయ్య వ్యవసాయ క్షేత్రంలో ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు తవ్వకాలు జరిపి పూడ్చివేశారు. సోమవారం ఉదయం సదరు రైతు గమనించి గ్రామ సర్పంచి నర్సింహకి చెప్పగా ఘటనా స్థలాన్ని ఆయన పరిశీలించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసుల అక్కడికి చేరుకొని విచారణ చేపడుతున్నారు.

దొంగలను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు: డీఎస్పీ

మర్రిగూడ, న్యూస్‌టుడే: మండలంలో తాళం వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న దొంగతనాల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని దేవరకొండ డీఎస్పీ శ్రీనివాసరావు పేర్కొన్నారు. మండల పరిధిలోని శివన్నగూడెం, కుదబక్షుపల్లి గ్రామాల్లో చోరీలు జరిగిన ప్రాంతాలను స్థానిక ఎస్ఐ రాంబాబుతో కలిసి ఆయన సోమవారం పరిశీలించి బాధితుల నుంచి పలు వివరాలు అడిగి

శివన్నగూడెంలో ఓ ఇంట్లో వివరాలు తెలుసుకుంటున్న డీఎస్పీ శ్రీనివాసరావు

తెలుసుకున్నారు. దొంగలను పట్టుకునేందుకు మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని... ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. సోషల్ మీడియాలో వస్తున్న వాటిని నమ్మి ప్రజలు భయాందోళనలకు గురి కావొద్దని విజ్ఞప్తి చేశారు. వారివెంట పోలీసుసిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా పోలీసు సంక్షేమ సంఘం అధ్యక్షుడి ఎన్నిక

నల్గొండ అర్బన్, న్యూస్‌టుడే: జిల్లా పోలీసు సంక్షేమ సంఘం అధ్యక్షులుగా సట్టు సైదులు గెలుపొందారు. జిల్లా వ్యాప్తంగా శనివారం నిర్వహించిన ఓట్లలో 13మంది ఏఆర్ విభాగం, 30 మంది సివిల్ విభాగంలో గెలుపొందారు. అందులో 13 మందితో కూడిన నూతన కమిటీకి ఏఎస్పీ రమేశ్

కమిటీ సభ్యులను సన్మానిస్తున్న సిబ్బంది

ఆధ్వర్యంలో సోమవారం ఓటింగ్ నిర్వహించారు. ఇందులో 9 ఓట్ల మెజార్టీతో సైదులు అధ్యక్షులుగా విజయం సాధించారు. ప్రధాన కార్యదర్శిగా పసుపులేటి బాలకృష్ణ, కోశాధికారిగా కాశిరెడ్డి సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా ఇరిగి రవి, కరుణాకర్, సంయుక్త కార్యదర్శిగా కోటా సాయిరాం, కార్యనిర్వాహక కార్యదర్శిగా చిన్నపంగు వినోద్, సభ్యులుగా రమేశ్, జ్యోతి, భాస్కర్, సుధాకర్ శ్రీహరి, వెంకన్నలను ఎన్నుకున్నారు.

చీటింగ్ కేసులో ఇద్దరికి మూడేళ్ల జైలు

ఖమ్మం న్యాయవిభాగం, న్యూస్‌టుడే: మోసపూరితంగా ఇల్లు విక్రయించిన కేసులో నల్గొండ జిల్లా అనుముల మండలం శ్రీరాంపురం గ్రామానికి చెందిన మేడిద మాల్యాద్రి(ఏ1), ఖమ్మం వైరారోడ్‌లోని అలహాబాద్ బ్యాంక్ మేనేజర్ కేవీఎన్ రామకృష్ణ(ఏ3)కు మూడేళ్ల జైలుశిక్ష, రూ.10 వేల చొప్పున జరిమానా విధిస్తూ ఖమ్మం రెండో అదనపు ప్రథమశ్రేణి కోర్టు జడ్జి యేపూరి బిందుప్రియ సోమవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ ప్రకారం. . ఏపీ రాష్ట్రం చిత్తూరులో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న కాళంగి మాధవీరత్నం అక్కడే జిల్లా సమాచార అధికారిగా పనిచేస్తున్న ఆమె భర్త కిరణ్ సుధాకర్ కలిసి 2012, మార్చి 21న ఖమ్మం శ్రీరాంనగర్‌లో రూ.22 లక్షలకు మాల్యాద్రి వద్ద ఇల్లు కొనుగోలు చేశారు. రూ.20 లక్షలు అలహాబాద్ బ్యాంక్ నుంచి రుణం తీసుకున్నారు. ఒరిజినల్ దస్తావేజులు బ్యాంక్‌లో డిపాజిట్ చేశారు. అనంతరం ఆ ఇంటిని స్వాధీనం చేసుకొని అద్దెకు ఇవ్వగా 2015, మార్చి 2న ఏపీజీవీబీ ఖమ్మం శాఖ మేనేజర్ పట్నాయక్ వచ్చి సదరు ఇల్లు తమ బ్యాంక్ తనఖాలో ఉందని, వెంటనే ఖాళీ చేయాలని కిరాయిదారునికి చెప్పారు. ఆయన విషయాన్ని యజమానులకు తెలియచేయగా వారు ఖమ్మం వచ్చి ఆయా బ్యాంకుల్లో విచారించారు. రెండు బ్యాంకుల్లో సరైన సమాధానం చెప్పలేదు. దీంతో మోసపోయామని గ్రహించిన బాధితులు ఇద్దరు బ్యాంక్ మేనేజర్లతోపాటు ఇల్లు అమ్మిన మాల్యాద్రిపై ఖానాపురం హవేలి ఠాణాలో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు సమగ్ర దర్యాప్తు అనంతరం కోర్టులో అభియోగపత్రం దాఖలు చేశారు. విచారణలో ఏ1 మాల్యాద్రి, ఏ3 కేవీఎన్ రామకృష్ణపై నేరం రుజువు కావడంతో పైవిధంగా తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ ఎస్.గాయత్రి వాదనలు వినిపించగా ఐఓలు టి.వెంకటేశ్వర్లు, సీహెచ్.శ్రీధర్, కె.రామారావు, సీడీఓ ఎ.మదారు సహకరించారు.

సినిమాలు నీలగిరి, న్యూస్‌టుడే:
తిరుమల - ఇరుముడి, **వెంకటేశ్వర** - విశ్వనాథన్ & సన్స్ **నటరాజ్** - టాక్సిక్

ఆటలోకి దిగితే పతకాలే

నల్గొండ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో ప్రతిభ చాటుతున్నారు. ఇష్టమైన క్రీడాంశంలో కోచ్‌లు ఇస్తున్న శిక్షణలో తర్ఫీదు పొందుతూ పట్టు సాధిస్తున్నారు. ఆటల పోటీలు ఎక్కడ జరిగినా పాల్గొని ప్రతిభతో పతకాలు ఒడిసిపడుతున్నారు. అత్యుత్తమ ఆటతో తాము ప్రాతినిథ్యం వహిస్తున్న క్రీడా జట్టుకు ఎన్నో విజయాలు అందిస్తున్నారు. ఖోఖో క్రీడలో జాతీయ, రాష్ట్రస్థాయిలో జిల్లాకు చెందిన పలువురు విద్యార్థులు రాణిస్తున్నారు.

జాతీయస్థాయిలో పేరు తెచ్చుకోవాలని: ప్రశాంత్

నేను ప్రస్తుతం తెలంగాణ మోడల్ స్కూల్ కనగల్‌లో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నా. గత నాలుగేళ్లుగా ఖోఖోలో శిక్షణ పొందుతున్నా. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం వేళల్లో పాఠశాల మైదానంలో గంటల కొద్ది సాధన చేస్తున్నా. ప్రిన్సిపల్, పీడీ ప్రోత్సాహంతో ఖోఖో ఆటలో మెరుగైన క్రీడాకారుడిగా గుర్తింపు పొందాను. ఇప్పటి వరకు హైదరాబాద్, కరీంనగర్, వరంగల్, నల్గొండ, పెద్దపల్లి, మహబూబ్‌నగర్ తదితర జిల్లాల్లో జరిగిన 6 రాష్ట్రస్థాయి పోటీల్లో కెప్టెన్‌గా వ్యవహరించి జట్టుకు విజయాలు అందించాను. భవిష్యత్తులో ఖోఖోలో జాతీయస్థాయిలో ఆడి మంచిపేరు సాధించడమే లక్ష్యం.

ప్రభుత్వ ఉద్యోగం సాధించడమే లక్ష్యం: పల్లవి

నేను ప్రస్తుతం తెలంగాణ మోడల్ స్కూల్ కనగల్‌లో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నా. మూడు సంవత్సరాలుగా ఖోఖోలో శిక్షణ తీసుకుంటున్నా. మొదట్లో జిల్లాస్థాయిలో ఆడిన నేను నిరంతర పట్టుదలతో ఖోఖో రాణిస్తూ జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్నా. ఇప్పటి వరకు జాతీయస్థాయిలో ఒకసారి, రాష్ట్రస్థాయిలో ఐదుసార్లు ఆడి పలు పతకాలు, బహుమతులు సాధించా. చదువులో ఉత్తమ ఫలితాలు సాధిస్తూనే క్రీడల్లో రాణిస్తున్నందుకు ఆనందంగా ఉంది. భవిష్యత్తులో ప్రభుత్వ ఉద్యోగం సాధించడమే నా ధ్యేయం.

ఖైదీల హక్కులను కాపాడాలి

మాట్లాడుతున్న న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి హిమబిందు

నల్గొండ అర్బన్, న్యూస్‌టుడే: జైళ్లలో శిక్ష అనుభవిస్తున్న ఖైదీల హక్కులను కాపాడాల్సిన అవసరం ఉందని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి హిమబిందు అన్నారు. జిల్లా కేంద్రంలోని కారాగారంలో హైదరాబాద్ లీగల్ ఏయిడ్ సొసైటీ, జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ప్రతి వ్యక్తికి చట్టపరమైన హక్కులు ఉంటాయని, న్యాయం పొందేందుకు ఆర్థిక పరిస్థితులు అడ్డంకిగా మారకూడదని పేర్కొన్నారు. అవసరమైన ఖైదీలకు న్యాయసహాయం ఉచితంగా అందేలా డీఎల్ఎస్ఏ ద్వారా సహకారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో చీఫ్‌లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎన్. భీమార్జున్‌రెడ్డి, జైలు సూపరింటెండెంట్ ఆనందరావు, ప్రతాప్ రెడ్డి, కన్నన్, జైలర్ బాలకృష్ణ, లచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎం పర్యటనకు ఏర్పాట్లు

నకిరేకల్, న్యూస్‌టుడే: నకిరేకల్‌లో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన కోసం అధికారులు ఏర్పాట్లు ముమ్మరం చేస్తున్నారు. ఈనెల 5న వంద పడకల ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిని సీఎం ప్రారంభించనుండటంతో వైద్య విధాన పరిషత్ రాష్ట్ర ప్రత్యేక అధికారి డా. రవూఫ్, టీఎంఎస్ఐడీసీ ప్రత్యేక అధికారిణి అలేఖ్య, డీసీహెచ్ఎస్ డా. మాతృనాయక్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. శోభారాణి తదితరులు వైద్యశాల భవనాలను సోమవారం పరిశీలించారు.

నకిరేకల్‌లో పరిశీలిస్తున్న వైద్యవిధాన పరిషత్ ప్రత్యేక అధికారి డా.రవూఫ్, అలేఖ్య, డా.మాతృనాయక్

పలు అంశాలపై చర్చించారు. మూడు రోజుల్లో అన్ని విభాగాలకు సంబంధించిన వైద్య పరికరాలు ఆసుపత్రికి చేరుకుంటాయని డీసీహెచ్ఎస్ డా. మాతృనాయక్ తెలిపారు. 112 పడకలను ఏర్పాటు చేస్తున్నామన్నారు.

నగర సమగ్ర అభివృద్ధికి కృషి

మాట్లాడుతున్న మేయర్ బుర్రి చైతన్యరెడ్డి

నల్గొండ జిల్లా పరిషత్తు, న్యూస్‌టుడే: నల్గొండ సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తామని, ఆదాయ వనరులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని నగర మేయర్ బుర్రి చైతన్యరెడ్డి అన్నారు. సోమవారం జరిగిన సాధారణ సమావేశంలో పలువురు కార్పొరేటర్లు పలు అంశాలపై గళం విప్పారు. గడియారం కేంద్రంలో కళాభారతి నిర్మించాలని భారాస కార్పొరేటర్లు డిమాండ్ చేశారు. డివిజన్లల్లో సమస్యలు పేరుకుపోతున్నాయని వాటి పరిష్కారానికి కనీసం రూ.10 లక్షల చొప్పున నిధులు కేటాయించాలని భాజపా కార్పొరేటర్ సాయి కోరారు. సభ్యులు అడిగిన ప్రశ్నలకు అధికారులు సమాధానం ఇచ్చారు. పదో డివిజన్ కార్పొరేటర్ కృష్ణంరాజు మాట్లాడుతూ... గంధవారిగూడెం రోడ్డు విస్తరణ పనులు త్వరగా చేపట్టాలన్నారు. అనంతరం మేయర్ చైతన్యరెడ్డి మాట్లాడారు. రాజకీయాలకు అతీతంగా, అన్ని డివిజన్ల పరిధిలో అభివృద్ధి పనులు చేపట్టే విధంగా కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రతి రోజు ఒక డివిజన్‌లో పర్యటిస్తామని వెల్లడించారు. గడియారం కేంద్రంలోని స్థలంలో బహుళ అంతస్తుల వాణిజ్య భవనం నిర్మించి నగరపాలక సంస్థకు ఆదాయం సమకూరే విధంగా ప్రతిపాదనలు తయారు చేస్తామన్నారు. అనంతరం సభ్యులు ఎజెండాను ఆమోదించారు. కొంత మంది ప్రతిపక్ష కార్పొరేటర్లు తమకు మాట్లాడే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో డిప్యూటీ మేయర్ అష్రఫ్‌ఆలీ, కమిషనర్ కృష్ణవంశీ, పలువురు కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

హాజరైన కార్పొరేటర్లు, అధికారులు

2, 3 తేదీల్లో ఎస్‌జీఎఫ్ క్రీడోత్సవాలు

మర్రిగూడ, న్యూస్‌టుడే: ఈనెల 2, 3వ తేదీలలో మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడోత్సవాలను నిర్వహిస్తున్నట్టు ఎంఈవో శారద ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని అన్ని పాఠశాలల విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను చాటాలని పిలుపునిచ్చారు. పలు పాఠశాలల హెచ్ఎంలు, పీఈటీలు పోటీలను విజయవంతం చేయాలని కోరారు.

బ్రేక్ ఫ్రీ యాప్ గోడప్రతి ఆవిష్కరణ

నల్గొండ అర్బన్, న్యూస్‌టుడే: జిల్లాలో హెచ్ఐవీ రిస్క్ స్థాయిని తెలుసుకోవడంతో పాటు తరువాత తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలిపే బ్రేక్ ఫ్రీ యాప్ గోడప్రతిని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ సోమవారం స్థానిక కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డా.రాహుల్, అదనపు డీఎంహెచ్‌వో డా.శంకర్, డా.అరుంధతి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఫీజు బకాయిలు చెల్లించండి

నిరసనలో భాజపా నాయకులు

నల్గొండ కలెక్టరేట్, న్యూస్‌టుడే: విద్యార్థుల ఫీజు బకాయిలు వెంటనే చెల్లించాలని ఫీజు బకాయి- బీజేపీ లడాయి కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టరేట్ ఎదుట భాజపా నాయకులు నిరసన చేపట్టారు. కార్యక్రమంలో పాల్గొన్న పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాసం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల ఫీజు బకాయిలు చెల్లించకుండా నిర్లక్ష్యం చేస్తుందన్నారు. అనేక మంది పేద విద్యార్థులను కాంగ్రెస్ ప్రభుత్వం విద్యకు దూరం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో భాజపా నాయకులు గోలి మధుసూదన్‌రెడ్డి, మాదగాని శ్రీనివాస్‌గౌడ్, వీరెల్లి చంద్రశేఖర్, పిల్లి రామరాజు, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సతీష్‌కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నల్గొండ సంక్షేమం: విద్యార్థులకు బోధనారుసుము బకాయిలను వెంటనే విడుదల చేసి ఇబ్బందులు లేకుండా చూడాలని ధర్మసమాజ్ పార్టీ(డీఎస్పీ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్ బి.చంద్రశేఖర్‌కు సోమవారం విజ్ఞప్తి చేశారు. ఫీజులతో నిమిత్తం లేకుండా విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలను యాజమాన్యాలు అందజేసేలా జీవో జారీ చేయాలని డిమాండ్ చేశారు. సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ధర్మ సమాజ్‌పార్టీ జిల్లా నాయకులు జగన్, వంశీ, రవికుమార్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా గుంత

తుంగతుర్తి చెరువు అలుగు సమీపంలో రహదారిపై ప్రమాదకరంగా..

కేతేపల్లి, న్యూస్‌టుడే: కేతేపల్లి మండలంలోని తుంగతుర్తి గ్రామశివారులో ఉప్పలపహాడ్- మిర్యాలగూడ ప్రధాన రహదారిపై ప్రమాదకరంగా గుంతలు ఏర్పడ్డాయి. తుంగతుర్తి చెరువు అలుగు సమీపంలో రహదారి మలుపు వద్ద బీటీ రోడ్డు మధ్యలో ఒకటి, చివరి భాగంలో మరో గుంత ఉంది. రహదారి మలుపు ఉండటంతో వాహనాలు అక్కడికి వచ్చే వరకు గుంతలు ఉన్నాయనే విషయం వాహనదారులకు తెలియడం లేదు. నిత్యం రద్దీగా ఉండే ఈరహదారిపై రోడ్డు ఇరుగ్గా ఉండటంతో వాహనాల చక్రాలు అందులో పడి దెబ్బతింటున్నాయి. అధికారులు వెంటనే స్పందించి అవసరమైన మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

జాతీయ రహదారిపై ప్రమాదం. నలుగురికి గాయాలు

కేతేపల్లి, న్యూస్‌టుడే: కేతేపల్లి మండలంలోని చీకటిగూడెం గ్రామశివారులో 65వ నంబరు జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు వ్యక్తులు గాయపడ్డారు. ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు... నకిరేకల్ నుంచి ప్రయాణికులతో సూర్యాపేట పట్టణానికి వెళుతున్న ఆటోను అదేమార్గంలో వెనుకవైపు నుంచి వచ్చిన ట్రాలీఆటో ఢీకొట్టింది. ప్రమాదానికి గురైన రెండు ఆటోలు రోడ్డుపైనే నిలిచిఉన్నాయి. హైదరాబాద్ నుంచి సత్తుపల్లికి వెళుతున్న ఆర్టీసీ రాజధాని డీలక్స్ బస్సును డ్రైవర్ వాటిని తప్పించే ప్రయత్నం చేస్తుండగా అదుపుతప్పి రహదారి మధ్యలో ఉన్న విభాగిని పైకి ఎక్కింది. బస్సులో ప్రయాణికులెవరికీ ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. కాగా ప్రయాణికులతో వెళుతున్న ఆటోలో నలుగురు వ్యక్తులు గాయపడ్డారు. ఈ ప్రమాదంపై తమకు ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

విభాగినిపైకి ఎక్కిన బస్సు

రోడ్డు వేశారు...ఆలయ నిర్మాణం మరిచారు

కేతేపల్లి మండలంలోని ఇనుపాముల గ్రామంలో మల్లన్నగుట్టపైకి నిర్మించిన ఘాట్‌రోడ్డు

కేతేపల్లి, న్యూస్‌టుడే: కాకతీయుల పాలనలో కేతేపల్లి మండలంలోని ఇనుపాముల గ్రామంలో నిర్మించిన ప్రాచీన శివాలయం 65వ నంబరు జాతీయ రహదారి పక్కన ఉండేది. 2011లో రహదారి విస్తరణ సందర్భంగా ఈ ఆలయం రూపు కోల్పోయింది. ప్రభుత్వం నష్ట పరిహారంగా రూ.38.50 లక్షలను మంజూరు చేసింది. బాలాలయంలో శివలింగాన్ని ప్రతిష్ఠించి 15 ఏళ్లనుంచి నిత్యపూజలు నిర్వహిస్తున్నారు. ప్రాచీన ఆలయ నిర్మాణాన్ని గుట్టపై చేపట్టేందుకు గతంలో నాటి ప్రజాప్రతినిధులు శంకుస్థాపన చేశారు. ఈప్రాచీన శివాలయానికి కేతేపల్లి మండలంతో పాటు, నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలి వస్తారు.

★ జాతీయ రహదారి వెంట ఉన్న మల్లన్న గుట్టపై ఆలయ నిర్మాణానికి రూ.6.50 కోట్లు మంజూరు చేస్తూ 2023లో అప్పటి ప్రభుత్వం జీవో జారీ చేసింది. నిధుల్లో నుంచి రూ.1.50 కోట్లతో గుట్టపైకి ఘాట్‌రోడ్డు నిర్మించాలని ప్రతిపాదించారు. గుత్తేదారు గుట్టపైకి ఘాట్ రోడ్డు వేశారు. సగం నిధులు కూడా మంజూరు కానందున కొంత పనిని నిలిపివేశారు.

రెండుసార్లు టెండర్లు పిలిచినా

ఇనుపాముల ప్రాచీన శివాలయం నిర్మాణానికి ప్రభుత్వం రెండుసార్లు టెండర్లు పిలిచింది. రెండు పర్యాయాలు కూడా గుత్తేదారులు ముందుకు రాకపోవడంతో ఆలయ నిర్మాణ పనులు ముందుకు పడటం లేదు. రాష్ట్రంలోని దేవాలయాల నిర్మాణ పనులు చేసిన గుత్తేదారులకు ఏళ్ల తరబడి బిల్లులు రాకపోవడంతో ఈ ఆలయ పనుల నిర్వహణకు ఎవరూ ముందుకు రావడం లేదు. ఇప్పటికైనా పాలకులు దృష్టి సారించి ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM to 1 PM)

80085 52710 (నల్గొండ), 80085 74421 (నకిరేకల్), 80085 66199 (మునుగోడు), 80085 74385 (చిట్యాల)

నల్గొండ జిల్లా పరిషత్తు, న్యూస్‌టుడే:

? నగరంలోని కేశరాజుపల్లిలో మురుగు కాల్వలు పేరుకుపోయాయి. దుర్వాసన వ్యాపిస్తోంది. శుభ్రం చేయించాలి. - అండాలు, నల్గొండ.

✔ పరిశీలించి కాల్వలు శుభ్రం చేయిస్తాం. -ప్రదీప్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్, నగరపాలక సంస్థ నల్గొండ

? నగరంలోని పదో డివిజన్ పరిధిలోని గంధవారిగూడెం మార్గంలో విద్యుత్తులోవోల్టేజీ సమస్యలు పరిష్కరించాలి. -బషీర్, నల్గొండ

✔ పరిశీలించి అవసరమైన నియంత్రణ చర్యలు తీసుకుంటాం. -వేణుగోపాలాచార్యులు, ఏడీఈ, విద్యుత్తు సంస్థ నల్గొండ.

మొక్క తొలగింది

స్పందనకు వందనం

మాడ్గులపల్లి, న్యూస్‌టుడే: మాడ్గులపల్లి మండల కేంద్రంలో యునాని వైద్యశాల భవనం శిథిలావస్థకు చేరడంతో పాటు, భవనంపై మర్రిమొక్క పెరిగి పెద్దదిగా మారుతోంది. ఈ విషయమై 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి స్పందన లభించింది. సర్పంచి ఆరూరి నరేశ్ ఆధ్వర్యంలో సిబ్బంది మొక్కను తొలగించారు.

సమస్యల పరిష్కారానికి వినతి

నల్గొండ లీగల్, న్యూస్‌టుడే: జిల్లా కోర్టుల్లో న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని జిల్లా న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో

జిల్లాజడ్జి పాటిల్ వసంత్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న న్యాయవాదులు

జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. కుటుంబ న్యాయస్థానం, ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, సంచార న్యాయస్థానాల్లో న్యాయమూర్తులను తక్షణమే నియమించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. న్యాయవాదుల సమస్యల పట్ల ఆయన సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర న్యాయవాదుల సంఘం ఉపాధ్యక్షులు, న్యాయవాది ఆదిరెడ్డి, జిల్లా అధ్యక్షులు కట్ట అనంతరెడ్డి, నాయకులు గుండె వెంకటేశ్వర్లు, గోగిగార్ జవహర్ లాల్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతగా పనులు పూర్తిచేయాలి

నకిరేకల్, న్యూస్‌టుడే: నకిరేకల్ పురపాలిక పరిధిలోని కాలంవారికుంట అభివృద్ధి పనులు నాణ్యతగా పూర్తి చేయాలని, కుంటలో మట్టితవ్వకాలపై విచారణ జరపాలని కోరుతూ మండల ప్రజావాణిలో స్థానిక నవ్య ఛారిటబుల్ సొసైటీ అధ్యక్షుడు పులిగిళ్ల అభిరామ్ సోమవారం ఫిర్యాదు చేశారు. కోతులు, కుక్కల సమస్య పరిష్కరించాలని విన్నవించారు. నేటి ప్రజావాణిలో ఆరు అర్జీలు అందాయని ఎంపీడీవో జి.బ్రహ్మచారి తెలిపారు. వీటిలో మూడు రెవెన్యూ, రెండు పురపాలిక, ఒకటి గృహనిర్మాణ సమస్యలపై అందాయన్నారు.

చిట్యాల, న్యూస్‌టుడే: వారానికోసారి చిట్యాల మండల ప్రజాపరిషత్తు కార్యాలయంలో నిర్వహించే మండల స్థాయి 'ప్రజావాణి'లో అధికారులకు సోమవారం ఒకేఒక్క విజ్ఞప్తి అందింది. గీత, నేత తదితర వృత్తిదారులకు ఇచ్చిన విధంగానే నాయీబ్రాహ్మణ వృత్తిదారుల్లో 50 ఏళ్ల వయసు నిండిన వారికి వృద్ధాప్య పింఛను మంజూరు చేయాలని కోరుతూ చిట్యాల నాయీ బ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు ఎంపీడీవో పాండుకు వినతిపత్రాన్ని అందజేశారు. సంఘం రాష్ట్ర నాయకుడు చికిలంమెట్ల అశోక్ మాట్లాడారు. ప్రభుత్వం నాయీబ్రాహ్మణుల సమస్యను పరిష్కరించాలన్నారు.

బ్యాగుల పంపిణీ

నార్కట్‌పల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: నార్కట్‌పల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు పాఠశాల ప్రిన్సిపల్ శీబా ఆధ్వర్యంలో ఉచితంగా బ్యాగులు, బూట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. క్రమశిక్షణతో చదువుతూ మంచి మార్కులు సాధించి కళాశాలకు పేరు తీసుకురావాలని కోరారు. అధ్యాపకులు నడింపల్లి వెంకటేశ్వర్లు, వెంకటేష్, అంజిబాబు, రాములు, తేజస్విని, అస్మా, బేబీ, నవ్య, అరుణ తదితరులు పాల్గొన్నారు.

భారాస నాయకుల పరామర్శ

నీలగిరి, న్యూస్‌టుడే: భారాస మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డితో పాటు మున్సిపల్ మాజీ ఛైర్మన్ మందడి సైదిరెడ్డి బృందం వర్షిత్‌రెడ్డి తల్లి శ్రీదేవిరెడ్డి కుటుంబ సభ్యులను సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంట్లో ఉన్న మహిళపై కాంగ్రెస్ నాయకులు దౌర్జన్యానికి పాల్పడటం అమానుషమని అన్నారు. పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మురుగు కాల్వ శిథిలం

చిట్యాల, న్యూస్‌టుడే: చిట్యాలలో హైదరాబాద్‌కు వెళ్లేదారిలో సర్వీసు దారిని ఆనుకుని ఉన్న మురుగు కాల్వ పైకప్పు దెబ్బతిని ప్రమాదకరంగా ఉంది. జాతీయరహదారి విస్తరణ సమయంలో పెద్ద మురుగుకాల్వను నిర్మించారు. ప్రస్తుతం పైకప్పు దెబ్బతిని ప్రమాదకరంగా ఉంది. ఈ ప్రదేశంలో కనీసం వీధిదీపం కూడా లేదు. ఈ దారిలో నిత్యం వాహనాల రాకపోకలు అధికంగా సాగుతుంటాయి. సెలవు, వారాంతంలో రద్దీ మరింతగా పెరుగుతుంది. ఒకేదారిలో పెద్ద వాహనాలు మూడు వరుసలుగా వెళుతుంటాయి. రాత్రివేళ ద్విచక్ర వాహనదారులకు ముప్పు పొంచి ఉంది. పైకప్పు వేయడం లేదా ప్రమాదకరంగా ఉన్నట్లు సూచిక ఏర్పాటుచేయాలని సంబంధిత అధికారులను స్థానికులు కోరుతున్నారు.

(c) eenadu

మిర్యాలగూడ
•మిర్యాలగూడ • నాగార్జునసాగర్ • దేవరకొండ

సబ్ జైల్‌లో సదుపాయాల పరిశీలన

వివరాలు అడిగి తెలుసుకుంటున్న సీనియర్ సివిల్ జడ్జి కె.అనిత

దేవరకొండ, న్యూస్‌టుడే: దేవరకొండ సబ్ జైలును మండల న్యాయసేవా సంస్థ ఛైర్మన్, మున్సిఫ్‌కోర్టు సీనియర్ సివిల్ జడ్జి కె.అనిత సోమవారం సందర్శించారు. సబ్ జైలులో మౌలిక సదుపాయాలను పరిశీలించారు. రిమాండ్ ఖైదీలతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమామహేశ్వర్, ఉప్పల రమేష్, శ్రీకాంత్, సిబ్బంది తదితరులున్నారు.

యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలి

మెట్ట పంటల సాగును పరిశీలిస్తున్న ఏడీఏ జగదీశ్వర్‌రెడ్డి

మిర్యాలగూడ, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్రేమ్ వర్క్ ఫర్ ఫెర్టిలైజర్ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఏడీఏ జగదీశ్వర్‌రెడ్డి కోరారు. మిర్యాలగూడ మండలంలోని పలు గ్రామాల్లో మెట్ట పంటల సాగును సోమవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. యాప్‌లో బుకింగ్ చేసుకొని డీఏపీ, ఇతర కాంప్లెక్స్ ఎరువులు పొందొచ్చన్నారు. రైతులు గూగుల్ ప్లే స్టోర్ నుంచి సులువుగా యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. ఆయన వెంట ఏవో రుషేంద్రమణి, ఏఈవోలు ఉన్నారు.

శత్రువుల రాకను కనిపెట్టే.. రాతి కట్టడం!

13, 14వ శతాబ్దంలోని రేచర్ల పద్మనాయక వెల్మ రాజుల రాజ్యానికి రాజధానిగా దేవరకొండ ప్రఖ్యాతి గాంచింది. ఖిల్లా దుర్గం నిర్మాణ క్రమంలో 360 దిన్నె, పెద్ద బురుజులు, 9 ప్రధాన ద్వారాలు, 32 ద్వారాలు, 23 పెద్దబావులు, 53 దిగుడు బావులు, 6 కోనేర్లు, 5 కొలన్లు, 13 ధాన్యాగారాలున్నాయి. కాలక్రమేణా కొన్ని కాలగర్భంలో కలిసిపోయాయి. కాగా శత్రువులు ప్రవేశించకుండా కోట చుట్టూ నిర్మించిన రాతి ప్రకారాలు మాత్రం ప్రస్తుతం దర్శనమిస్తున్నాయి. దక్షిణ దిశలో నిర్మించిన రెండు ప్రధాన ద్వారాలకు సమీపంలో సంపూర్ణ పరిజ్ఞానంతో శత్రువుల రాకను కనిపెట్టేందుకు చేపట్టిన నిర్మాణాలు అబ్బుర పరుస్తాయి.
– న్యూస్‌టుడే, దేవరకొండ

పరికరాలు పాడై.. వ్యాయామానికి దూరమై

ప్రజలకు ఆరోగ్యాన్ని అందించేందుకు మిర్యాలగూడ పట్టణంలో పలు చోట ఏర్పాటు చేసిన బాహ్య వ్యాయామ శాలల్లో పరికరాలు ధ్వంసమై నిరుపయోగంగా మారుతున్నాయి. రూ.లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన ఈ ఓపెన్ జిమ్‌ల నిర్వహణలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తుండడంతో పరికరాలు ధ్వంసం అవుతున్నా మరమ్మతులకు నోచుకోవడం లేదు. దీంతో వ్యాయామం చేసేందుకు వచ్చిన వారు నిరాశతో వెనుదిరుగుతున్నారు. – మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే:

పాతది వదిలేస్తారా..?.. స్థానిక బోటింగ్ పార్కులో కొన్నేళ్ల క్రితం ఏర్పాటు చేసిన జిమ్ పరికరాలు ధ్వంసమై ఫ్లోర్ మ్యాట్లు మొత్తం పోయి అస్తవ్యస్తంగా మారింది. పక్కన కొత్త జిమ్ ఏర్పాటు చేసినప్పటికీ పాత జిమ్‌కు సరైన నిర్వహణ ఉంటే అవి కూడా వినియోగంలోకి తేవొచ్చని ప్రజలు అంటున్నారు. ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

కొత్తవే విరుగుతున్నాయ్.. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కొత్తగా ఏర్పాటు చేసిన వ్యాయామ శాలలో పరికరాలు నాసిరకంగా ఉండడంతో అప్పుడే విరిగి పోతున్నాయి. జిమ్ ఏర్పాటు చేసిన కొన్ని నెలలకే పలు పరికరాలు ధ్వంసమై నిరుపయోగంగా మారుతున్నాయి. మరో వైపు జిమ్ ఏర్పాటు చేసిన తర్వాత కొంత కాలానికి సర్వీసింగ్ చేయాల్సి ఉన్నప్పటికి ఆ దిశగా ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో పరికరాల నట్లు వదులై విరిగి పోతున్నాయి.

పరిశీలన

విరిగిపోయి.. పట్టణంలోని హౌసింగ్‌బోర్డులో వాటర్ ట్యాంకు సమీపంలోని పార్కులో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌లో పరికరాలను సక్రమంగా అమర్చకపోవడంతో కొన్ని పరికరాలు వంగి నిరుపయోగంగా మారాయి. మరికొన్ని పరికరాలు విరిగిపోయాయి. దీంతో వ్యాయామం చేయాలనుకునే స్థానికులకు నిరాశే ఎదురవుతుంది.

నిత్యం వందలాది మంది.. ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానానికి నిత్యం వందలాది మంది వ్యాయామం కోసం వస్తుంటారు. ఇక్కడ కొన్నేళ్ల క్రితం జిమ్‌ను ఏర్పాటు చేసినప్పటికీ దీంట్లో పలు పరికరాలు విరిగిపోయాయి. పక్కనే కొత్త జిమ్ ఉన్నప్పటికీ ఇక్కడికి వస్తున్న ప్రజలకు సరిపోకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. పాత జిమ్‌లోని పరికరాలకు మరమ్మతులు చేయడంతో పాటు మరో కొత్త జిమ్‌ను సైతం ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM to 1 PM)

మిర్యాలగూడ: 77994 92939, దేవరకొండ: 99121 74975, త్రిపురారం: 97057 45533

వేములపల్లి, న్యూస్‌టుడే:

? బుగ్గబావిగూడెం గ్రామంలోని నార్కట్‌పల్లి-అద్దంకి ప్రధాన రహదారిపై మురుగు నీరు నిలిచి రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం. మురుగు నిలవకుండా చూడాలి. – సంపత్.
✔ సమస్యకు గల కారణాలను పరిశీలించి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాం. – శ్రీను, ఆర్అండ్‌బీ ఏఈ.

మిర్యాలగూడ, న్యూస్‌టుడే:

? రాంనగర్‌లో మిల్లుల కాలుష్యంతో ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు సమస్యను పరిష్కరించాలి.– శ్వేత.
✔ మిల్లుల వారికి నోటీసులు ఇచ్చి కాలుష్యం రాకుండా చూస్తాం. – నర్రా శ్రీజారెడ్డి, పుర కమిషనర్, మిర్యాలగూడ.
? పట్టణంలోని హనుమాన్‌పేటలో శివారు వీధుల్లో సిమెంట్ రోడ్లు వేసి ఇబ్బందులను తొలగించాలి. – శంకర్‌రావు.
✔ ఈసారి ప్రతిపాదనలు పంపిస్తాం. – నవీన్, ఏఈ.

మిర్యాలగూడ పట్టణం,న్యూస్‌టుడే:

? మండల పరిధిలోని కిష్టాపురంలో రోడ్డు వెంట వ్యర్థాలు పేరుకుపోయి ఇబ్బందులు పడుతున్నాం. – రాజేష్.
✔ వ్యర్థాలు తొలగిస్తాం. – రమేష్, ఎంపీవో.
? పట్టణంలోని హౌసింగ్‌బోర్డులో పక్క కాల్వలో వ్యర్థాలు పేరుకుపోయి ఇబ్బందులు పడుతున్నాం. – వెంకట్.
✔ వ్యర్థాలు తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం.
– నర్రా శ్రీజారెడ్డి, పుర కమిషనర్, మిర్యాలగూడ.

త్రిపురారం, న్యూస్‌టుడే:

? మండలంలోని అన్నారం ఎస్సీ కాలనీలో వీధిలైట్లు లేకపోవడంతో అంధకారం నెలకొంటుంది. రాత్రి సమయంలో అంధకారం నెలకొంటుంది. – వెంకన్న, అన్నారం.
✔ వీధి లైట్లు సిద్ధంగా ఉన్నాయి. వెంటనే వేయిస్తాం.
– సతీష్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి.
? సత్యనారాయణపురం గ్రామ పంచాయతీ పరిధిలోని గొల్లగూడెంలో పైపులైన్ లీకేజీతో నీరంతా వృథాగా పోతోంది. నీటి వృథాను అరికట్టాలి. – బైరు గురవయ్య, గొల్లగూడెం
✔ వెంటనే లీకేజీకి మరమ్మతులు చేయిస్తాం.
– వల్లాల శివ, పంచాయతీ కార్యదర్శి.

డయాలసిస్ రోగులకు మెరుగైన సేవలు

ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీసీహెచ్ మాతృనాయక్

దేవరకొండ, న్యూస్‌టుడే: దేవరకొండ ఏజెన్సీ ప్రాంతాల్లో మోతాదుకు మించి బోర్లలో ఫ్లోరిన్ శాతం ఉండడంతో గువ్వల గుట్ట, కంబాలపల్లి, కాచరాజుపల్లి, రేకులారం, చిత్రియాల ప్రాంతాల్లో కిడ్నీ వ్యాధి బారిన పడిన వారు అనేక మంది మంచాన పడ్డారు. వీరికి దేవరకొండలో డయాలసిస్ కేంద్రం ఉపశమనంగా మారింది. ప్రస్తుతం ఐదు బెడ్లతో ప్రతి రోజు 50 మందికి రక్త శుద్ధిని చేస్తున్నారు. వీటికి తోడు అదనంగా పది మందికి ఎదురుచూపులు తప్పడం లేదు. వీరిని పక్కన ఉన్న నాగార్జునసాగర్, మర్రిగూడ ఆసుపత్రులకు సిఫార్సు చేస్తున్నారు. ఈ క్రమంలో డయాలసిస్ కేంద్రంలో మరో ఐదు బెడ్లు పెంచుతున్నారు. మంగళవారం ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్, జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ ప్రారంభించనున్నారు. ఇప్పటికే జిల్లా ప్రభుత్వాసుపత్రుల సమన్వయ అధికారి ఏర్పాట్లను పరిశీలించారు.

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ

యజ్ఞంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ చిన్నపురెడ్డి దంపతులు, తదితరులు

పెద్దవూర, న్యూస్‌టుడే: మండలంలోని పినవూర గ్రామంలో శ్రీరామకోటేశ్వరాలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ తేరా చిన్నపురెడ్డి ఈ ధ్వజస్తంభ ప్రతిష్ఠను తన సొంత నిధులతో నిర్మించారు. ప్రతిష్ఠ మహోత్సవంలో భాగంగా కుంకుమార్చన, హోమం, పూర్ణకుంభం, నంది విగ్రహ నిర్మాణం వంటి కార్యక్రమాలను నిర్వహించారు. సర్పంచి లక్ష్మి, సందీప్ కుమార్, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులకు సత్వర పరిష్కారం

మిర్యాలగూడ, న్యూస్‌టుడే: ప్రజావాణి దరఖాస్తులకు సత్వర పరిష్కారం చూపే దిశగా అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేస్తున్నామని ఆర్డీవో రమణారెడ్డి తెలిపారు. మిర్యాలగూడ సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన డివిజన్ స్థాయి ప్రజావాణి కార్యక్రమంలో దరఖాస్తులు స్వీకరించి మాట్లాడారు. రెవెన్యూ, పురపాలిక శాఖలకు సంబంధించిన దరఖాస్తులను ఆయా కార్యాలయాలకు పంపి వివరాలు సేకరిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో డీఏవో శ్రీనివాసశర్మ, ఆయా విభాగాల అధికారులు పాల్గొన్నారు.

దరఖాస్తులను పరిశీలిస్తున్న ఆర్డీవో రమణారెడ్డి

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: మండల స్థాయిలో నిర్వహిస్తున్న ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మిర్యాలగూడ ఎంపీడీవో శేషగిరిశర్మ తెలిపారు. పట్టణంలోని తన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మండల స్థాయి ప్రజావాణిలో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి మాట్లాడారు. తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీవో రమేష్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మిర్యాలగూడలో ప్రజావాణిలో అర్జీలు స్వీకరిస్తున్న ఎంపీడీవో శేషగిరిశర్మ

చింతపల్లి, న్యూస్‌టుడే: ప్రజల సమస్యను పరిష్కరించుకునేందుకు ఏర్పాటు చేసిన ప్రజావాణిని ప్రజలందరు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో సుజాత తెలిపారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణికి నాలుగు దరఖాస్తులు వచ్చినట్లు ఆమె తెలిపారు.

కార్యాలయంపై దాడి చేయడం తగదు: భాజపా

మిర్యాలగూడ, న్యూస్‌టుడే: భాజపా రాష్ట్ర కార్యాలయంపై కాంగ్రెస్ నాయకులు దాడి చేయడం హేయనీయమని ఆ పార్టీ వన్‌టౌన్ అధ్యక్ష కార్యదర్శులు బంటు గిరి, కొంగరి వెంకటరమణ అన్నారు. మిర్యాలగూడలో సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ..రాజకీయంగా భాజపాను ఎదుర్కోలేక కార్యాలయాలపై దాడులకు దిగడం సరికాదన్నారు. సమావేశంలో మూల రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి: జిల్లా కేంద్రంలోని భాజపా కార్యాలయంపై కాంగ్రెస్ నాయకులు దాడి చేయడం తగదని భాజపా మాజీ రాష్ట్ర కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యులు ధరణిపతి రమణారావు అన్నారు.

సినిమాలు

మిర్యాలగూడ పట్టణం,న్యూస్‌టుడే:

రాఘవ: ఇరుముడి, శ్రీనివాస: టాక్సిక్, వెంకటేశ్వర: ఇరుముడి, విట్రోస్: టాక్సిక్, విశ్వనాథ్ అండ్ సన్స్, ఇరుముడి, హాయ్

ట్రాక్టర్లు ఇలా.. చెత్త తరలించేది ఎలా!

మిర్యాలగూడ పురపాలికలో పారిశుద్ధ్య విభాగంలో వినియోగిస్తున్న ట్రాక్టర్‌ల ట్రాలీలు శిథిలావస్థకు చేరి డోర్లు విరిగి, రంధ్రాలు పడటంతో చెత్త తరలించే సమయంలో వీధుల్లో పడి దుర్వాసనలు వెదజల్లుతున్నాయి. పట్టణంలో చెత్త తరలింపునకు గాను 48 వార్డులకు గాను 10 ట్రాక్టర్‌లు, 48 ఆటోలు ఉన్నాయి. ట్రాక్టర్లను ప్రధానంగా సాగర్ ప్రధాన రహదారి, పెద్ద బజారు, నేతాజీ కూరగాయల మార్కెటు, గణేష్ మార్కెటు, కుండల బజారు, డాక్టర్స్ కాలనీలో వినియోగిస్తున్నారు. రాత్రి సమయంలో ప్రధాన వీధులను శుభ్రం చేసి చెత్త తరలించేందుకు సైతం ఈ వాహనాలు వాడుతున్నారు. కొన్ని వాహనాలు ఇనుము తుప్పు పట్టి కింద భాగంలో రంధ్రాలు పడిపోయాయి. మరికొన్ని డోర్లు మరమ్మతులకు గురయ్యాయి. సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని పట్టణవాసులు కోరుతున్నారు. పారిశుద్ధ్య విభాగం వారితో సమావేశం ఏర్పాటు చేసి వాహనాల మరమ్మతుల విషయంపై నిర్ణయం తీసుకుంటామని కమిషనర్ శ్రీజారెడ్డి తెలిపారు.
– మిర్యాలగూడ, న్యూస్‌టుడే:

దారి.. అధ్వానంగా మారి

అనుముల మండలం కుపాసిపల్లి-మారేపల్లి గ్రామాల మధ్య నిరంతరం ట్రాక్టర్ల సహాయంతో ఇసుక, మట్టి రవాణా జరుగుతుండటంతో తారు రోడ్డు ధ్వంసమైంది. దీంతో రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నామని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి సమయంలో వాహనదారులు అదుపుతప్పి ప్రమాదాల బారిన పడిన ఘటనలు సైతం ఉన్నాయి. సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, హాలియా

మలుపు.. ప్రమాదానికి పిలుపు

మిర్యాలగూడ, న్యూస్‌టుడే: పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆర్అండ్‌బీ అతిథి గృహం మలుపులో గుంత ప్రాణాంతకంగా మారింది. రాత్రి వేళలో పలువురు ప్రమాదాల బారిన పడుతున్నారు. కోదాడ- జడ్చర్ల జాతీయ రహదారి పక్క నుంచి చర్చి మార్గంలోకి వెళ్లే రహదారి ఇక్కడ కూడలిగా ఉండటంతో వాహనాల రద్దీ అధికంగా ఉంటుంది. సంబంధిత అధికారులు స్పందించి గుంతపై మూతలు అమర్చాలని పట్టణవాసులు కోరుతున్నారు.

జెండా ఆవిష్కరణ... మిర్యాలగూడ: ఎరుకల హక్కుల పోరాట సమితి చేసిన పోరాటాల ఫలితంగానే 1952లో సిటీ యాక్టు చట్టాన్ని ప్రభుత్వం రద్దు చేసిందని ఆ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వజ్రగిరి అంజయ్య అన్నారు. మిర్యాలగూడ సుందర్ నగర్‌లో సోమవారం సమితి జెండా ఆవిష్కరించి మాట్లాడారు. గంగయ్య, వెంకన్న, విజయ్, రుద్ర, నాగమణి, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

నాగార్జునసాగర్: ఎరుకుల అభ్యున్నతి కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని జడ్పీ మాజీ వైస్ ఛైర్మన్ కర్నాటి లింగారెడ్డి అన్నారు. ఎరుకుల హక్కుల సాధన సమితి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సాగర్ హిల్‌కాలనీ వద్ద ఆయన జెండాను ఎగురవేశారు. ఆ సంఘం అధ్యక్షుడు కండెల వెంకటేశ్వర్లు, నాగరాజు, వెంకన్న, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉంగరాల శ్రీను, మాయకోటి శంకర్, సురేష్, పాల్గొన్నారు.

సన్మానం... నిడమనూరు: తపస్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్న నిడమనూరు ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయుడు గుడిపల్లి శ్రీనివాస్ రెడ్డిని ఆ పాఠశాల సిబ్బంది సోమవారం సన్మానించారు. ప్రిన్సిపల్ బూర్గు నిర్మళ, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులతో ఛైర్మన్... హాలియా: పట్టణ పారిశుద్ధ్యం కోసం కార్మికులతో కలిసి నగరం నిద్రలేవక ముందే పుర ఛైర్మన్ చింతల చంద్రారెడ్డి పర్యవేక్షించడం ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రతిరోజు కలిసి చెత్త తొలగించడం కోసం నిత్యం సూచనలు చేస్తూ అవగాహన కల్పిస్తున్నారని, ప్రజలతో మాట్లాడి ఇష్టానుసారంగా రోడ్డుపై చెత్త వేయవద్దని తెలుపుతున్నారని కార్మికులు చెబుతున్నారు.

నిరసన... హాలియా: విద్యార్థుల ఉపకార వేతనాలు, ఫీజు రీయంబర్స్‌మెంట్ పెండింగ్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం వారు హాలియాలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్, వర్షిత్, కార్తీక్, నాగరాజు, తదితరులున్నారు.

పరామర్శ... మిర్యాలగూడ పట్టణం: విద్యుదాఘాతంతో చేయి కోల్పోయి చికిత్స పొందుతున్న మిర్యాలగూడ మండలం గోగువారిగూడెం మాజీ ఉప సర్పంచి జంగా వెంకటయ్యను సోమవారం కాంగ్రెస్ జిల్లా నాయకుడు గాయం ఉపేందర్‌రెడ్డితో పాటు పలువురు నాయకులు పరామర్శించారు. ఆయన వెంట చెరుకూరి కోటేశ్వరరావు, తదితరులున్నారు.

సన్న వడ్లకు సర్కార్ బోనస్.. వేములపల్లి: ప్రస్తుత వానకాలం సీజన్‌లో ప్రభుత్వం సూచించిన ఏడు సన్న రకాల వరికి క్వింటాకు రూ.ఐదు వందలు బోనస్ అందించనున్నట్లు మండల వ్యవసాయశాఖ అధికారి కిశోర్‌నాయక్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు.

దామరచర్ల: ఖరీఫ్ సీజన్‌లో రాష్ట్ర ప్రభుత్వం సూచించిన 7 రకాల వరి వంగడాలకే క్వింటాకు రూ.500 చొప్పున బోనస్ లభిస్తుందని ఏవో బాలకృష్ణ అన్నారు. సోమవారం విడుదల చేసిన ప్రకటనలో బీపీటీ-5204, కేఎన్ఎం-1638, తెలంగాణ సోనా, హెచ్ఎంటీ, జేఎస్ఆర్, డబ్ల్యూజీఎల్-44, కేఎన్ఎం-7715 వరి వంగడాలు సాగు చేస్తేనే బోనస్ వస్తుందన్నారు.

కేసు నమోదు.. మాడ్గులపల్లి: జూదరులపై కేసు నమోదైన ఘటన కుక్కడం గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన కొందరు ఓ కాలనీలో జూదం ఆడుతున్నారు. నమ్మదగిన సమాచారం మేరకు సోమవారం పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. వారి నుంచి రూ.10,080 నగదు, 6 చరవాణులు స్వాధీనం చేసుకున్నారు.

ఇంటర్వ్యూలు... చింతపల్లి: మండలంలోని ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ ఉపాధ్యాయ, ఆయా పోస్టులను భర్తీ చేసేందుకు అర్హత సాధించిన అభ్యర్థులకు నెల 3న దేవరకొండలోని ఎంపీడీవో కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు సీడీపీవో సక్కుబాయి తెలిపారు.

ఉద్యోగి ఉదారత... రోగులకు చేయూత

కొండమల్లేపల్లి, న్యూస్‌టుడే: స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ల్యాబ్ టెక్నీషియన్‌గా విధులు నిర్వహిస్తున్న ఈ.వీరబాబు రోగుల పట్ల దాతృత్వం ప్రదర్శించాడు. కేంద్రంలో ఓ వ్యాధితో ఇబ్బందులు పడుతున్న పది మంది పేదలకు ఒక్కొక్కరికి నెలకు రూ.500 విలువ చేసే పోషకాలు గల పప్పులు, నిత్యావసర వస్తువులను వరుసగా ఆరు నెలల పాటు అందించేందుకు శ్రీకారం చుట్టాడు. అందులో భాగంగా సోమవారం పది మందికి డా.ఉషారాణి చేతుల మీదుగా సరకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మల్లికార్జున్, సైదులు, వసంత, రాణి, రవి, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

రోగులకు నిత్యావసర వస్తువులు అందజేస్తున్న డా.ఉషారాణి, చిత్రంలో దాత వీరబాబు

కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలి

మిర్యాలగూడ పట్టణం,న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో అందించే పథకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని మిర్యాలగూడలోని జడ్పీ ఉన్నత పాఠశాల-బకాల్‌వాడ ప్రధానోపాధ్యాయుడు అల్లుబెల్లి కరుణాకర్‌రెడ్డి అన్నారు. పాఠశాలలో విద్యార్థులకు సోమవారం ఏకరూప దుస్తులు, బూట్లు పంపిణీ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నల్లమేకల వెంకయ్య, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, శ్రీను, చంద్రయ్య, సైదులు తదితరులు పాల్గొన్నారు.

బకాల్‌వాడ పాఠశాలలో విద్యార్థులకు ఏకరూప దుస్తులు, బూట్లు పంపిణీ చేసిన సిబ్బంది

మేజర్ కాల్వలో పడి గొర్రెల కాపరి మృతి

నిడమనూరు, న్యూస్‌టుడే: గొర్రెలు మేపుతూ ప్రమాదవశాత్తు మేజర్ కాల్వలో పడి గొర్రెల కాపరి మృతిచెందిన ఘటన నిడమనూరులో సోమవారం చోటుచేసుకుంది. ఎస్సై విజయ్‌కుమార్ కథనం ప్రకారం... మండలంలోని వేంపాడు గ్రామానికి చెందిన కంసాని దుర్గయ్య(59) తన భార్య అంజమ్మతో కలిసి ఎడమకాల్వకు అనుసంధానంగా ఉన్న నేరళ్లగూడ(పార్వతీపురం) మేజర్ కాల్వ వద్ద మధ్యాహ్నం గొర్రెలు మేపుతున్నాడు. దుర్గయ్య మేకలు మేపుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు కాలుజారి అందులో పడిపోయాడు. కాల్వకు పూర్తి స్థాయిలో నీటి విడుదల ఉండటంతో ఈత రాని దుర్గయ్య మునిగిపోయాడు. స్థానికులు కాల్వలోకి దూకి రక్షించే ప్రయత్నం చేసిన ఫలితం దక్కలేదు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటకు తీయించి శవ పరీక్షల నిమిత్తం మిర్యాలగూడ ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. దుర్గయ్య కుమారుడు అశోక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలి

మిర్యాలగూడ, న్యూస్‌టుడే: గణేష్ నవరాత్రి వేడుకలను కులమతాలకు అతీతంగా భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని పట్టణ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. పట్టణంలోని ఇందిరమ్మ కాలనీ ఆరో వార్డులో సోమవారం ఉదయం గణేష్ ఉత్సవాల జెండాలను ఆవిష్కరించి మాట్లాడారు. తొమ్మిది రోజుల పాటు వివిధ రకాల అలంకరణతో ప్రత్యేకంగా పూజలు చేయాలన్నారు. కౌన్సిలర్ అశోక్ రాథోడ్ ఉత్సవ కమిటీ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవాల జెండా ఆవిష్కరిస్తున్న నూకల వేణుగోపాల్‌రెడ్డి, కౌన్సిలర్ అశోక్ రాథోడ్

సమాజ సేవకు కేటాయించాలి: ఎమ్మెల్సీ

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: ఉద్యోగ విరమణ చేసిన ప్రభుత్వ ఉద్యోగులు విశ్రాంత జీవితాన్ని సమాజ సేవకు వినియోగించాలని ఎమ్మెల్సీ శంకర్‌నాయక్ అన్నారు. మిర్యాలగూడ మండలం వాటర్‌ట్యాంకు తండా మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తూ ఉద్యోగ విరమణ పొందిన నోముల ధనుంజయను సోమవారం పట్టణంలో సత్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి చిలుకూరి బాలు తదితరులు పాల్గొన్నారు.

అధికారుల దృష్టికి తీసుకురావాలి

మాడ్గులపల్లి: గ్రామాల్లోని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని ఆర్ఐ శ్యామ్ అన్నారు. ధర్మాపురం గ్రామంలో పౌరహక్కుల దినోత్సవం సందర్భంగా సోమవారం గ్రామసభ నిర్వహించారు. సర్పంచి కొత్త దశరథ, తదితరులు పాల్గొన్నారు.

సొంత భవనాలు నిర్మించాలని వినతి

దేవరకొండ, న్యూస్‌టుడే: దేవరకొండ బీసీ బాలుర, బాలికల కళాశాల సంక్షేమ వసతి గృహాలకు సొంత భవనాలు నిర్మించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి చింతపల్లి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. సోమవారం ప్రజావాణిలో భాగంగా దేవరకొండ ఆర్డీవో పద్మప్రియకు వినతిపత్రం అందజేశారు. అద్దె భవనాల్లో అరకొర వసతులతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారని అన్నారు. కోటేశ్వర్‌రావు, వెంకటేష్, బిక్షమయ్య, గణేష్, వెంకటయ్య, వెంకన్న తదితరులున్నారు.

సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యం

హాలియా, న్యూస్‌టుడే: పేదల సొంతింటి కలను నెరవేర్చడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని హాలియా పుర వైస్ ఛైర్మన్ గౌని రాజారమేష్ యాదవ్, కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు కుందూరు వెంకటరెడ్డి అన్నారు. సోమవారం ఆయన హాలియాలో లబ్ధిదారుల నూతన గృహాలను ప్రారంభించి మాట్లాడారు. కౌన్సిలర్లు చెరుపల్లి ముత్యాలు, బొంగరాల ఏసురాజు, దేపావత్ ప్రసాద్‌నాయక్, నాయకులు నకిరేకంటి సైదులు, కొమ్మనబోయిన చంద్రశేఖర్, బాబుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

సమస్య చూడండి.. పరిష్కారం చూపండి

నాగార్జునసాగర్, న్యూస్‌టుడే: నాగార్జునసాగర్ వద్ద ఉన్న కొత్త వంతెన ప్రమాదకరంగా మారింది. సాగర్ జలాశయం నిర్మాణం తర్వాత ఆంధ్రా, తెలంగాణ మధ్య రాకపోకలన్నీ ప్రధాన డ్యాంపై నుంచి కొనసాగాయి. డ్యాం పై నుంచి భారీ వాహనాలు వెళ్లడంతో దానికి ఇబ్బందికర పరిస్థితులు వస్తాయన్న నిపుణుల సలహా మేరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2001లో సాగర్ డ్యాంకు దిగువన సుమారు కిలోమీటర్ల పొడవు కలిగిన భారీ వంతెన నిర్మాణానికి శ్రీకారం చేసింది. ఈ నిర్మాణం 2004లో పూర్తి చేసుకొని ఆంధ్రా, తెలంగాణ ప్రాంతాల మధ్య రాకపోకలు ప్రారంభమయ్యాయి. వంతెన నిర్మాణ సమయంలో అధికారులు చేసిన నిర్లక్ష్యం సాగర్ సందర్శనకు వస్తున్న పర్యాటకులకు భయాందోళన కలిగిస్తుంది.


అంధకారంలో కొత్త వంతెన

● ఈ వంతెన పై నిర్మించిన రక్షణ గోడల ఎత్తు తక్కువగా ఉండడం, ఇక్కడ అంత ఖాళీ ప్రదేశం కావడంతో ఈ ప్రాంతంలో గాలి ఒత్తిడి చాలా ఎక్కువగా ఉంటుంది. ఈ ఒత్తిడి కారణంగా వంతెన పై నుంచి నదిలో పడిపోయే అవకాశం ఉంది. ముఖ్యంగా వంతెనపై ఎలాంటి విద్యుత్తు దీపాలు లేకపోవడంతో దీని పైకి ఎవరు వస్తున్నారు గమనించే అవకాశం లేకుండా పోయింది. ముఖ్యంగా సాగర్ డ్యాం గేట్ల ద్వారా నీటి విడుదల దృశ్యం దీనిపై నుంచి ఎంతో అద్భుతంగా కనిపిస్తుంది. ఈ దృశ్యాన్ని చూడటానికి పర్యాటకులు ఈ వంతెన పైకి భారీగా వస్తుంటారు. అలాంటి సమయంలో గాలి అధికంగా ఉండడంతో ప్రమాదాలు జరిగే అవకాశముంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి వంతెనపై రక్షణ గోడల ఎత్తు పెంచి, విద్యుత్తు దీపాలను ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

● ఈ కొత్త వంతెన సూసైడ్ పాయింట్‌గా తయారైంది. ఈ వంతెనకు ఉన్న రక్షణ గోడల ఎత్తు తక్కువగా ఉండడం, ఎలాంటి విద్యుత్తు దీపాలు లేకపోవడంతో కొందరు దీని పై నదిలోకి దూకి ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. గత ఐదేళ్లలో ఐదుగురు ఇక్కడ నదిలోకి ఆత్మహత్యకు పాల్పడ్డారు. దీనిపై అంతా చీకటిగా ఉండడంతో రాత్రి సమయంతో దీని పై నుంచి నదిలోకి తోసే అవకాశాలు లేకపోలేదు. వెంటనే అధికారులు ఈ వంతెనపై తగిన జాగ్రత్త చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

(c) eenadu